
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 24-1-2025 ₹15/-

# బడ్జెట్ భారతం






# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 47 సంచిక: 4 హైదరాబాద్
శుక్రవారం 24 జనవరి 2025 రూ.15-00
23 రజబ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**మీరు మిమ్మల్ని అనుమానాల నుంచి రక్షించుకోండి. ఎందుకంటే అనుమానం అన్నది అతి నీచమైన అబద్ధం.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ





**ఈ తప్పు ఎవరిది?**

## లోపల...


| | | |
|---|---|---|
| ఇండియా | ...... | 04 |
| బడ్జెట్ భారతం | ...... | 05 |
| HMPV వైరస్ ప్రమాదకరం కాదు | ...... | 08 |
| కంటి 'పాప'లు ఇంటి వెలుగులు | ...... | 10 |
| దేవుని కానుక నమాజ్ | ...... | 12 |
| చరితార్థులు-2 : సకీనతుల్ ఫాతిమా | ...... | 14 |
| ఖుర్ఆన్ పరిచయం | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామీయ ఉద్యమం దాని క్రమ వికాసం - 4 | ...... | 20 |
| మస్జిదులు మానవతా కేంద్రాలు | ...... | 22 |
| కారుణ్య వ్యవస్థ ఇస్లామ్ - 2 | ...... | 24 |
| పువ్వులైనా, రాళ్ళయినా సమానమే! | ...... | 27 |
| అద్భుత ఆరాధనా ఆహ్వానం అజాన్ | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| మధ్యే మార్గమే ఉత్తమం! | ...... | 34 |


### గణతంత్రం



ఏడున్నర దశాబ్దుల
ఘనమైన గణతంత్రం
ఆటుపోట్ల పయనాన
అలరించె జనతంత్రం!
భారతీయ పటంపైన
మువ్వన్నెల సంతకం
ధనం మాన ప్రాణాలు
దేశ ప్రగతికి అంకితం!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# ఇండియా

**ఇండియా కూటమి** పట్ల ఆప్ అధినేత ఇప్పుడు ఎలా మాట్లాడినా 2013 నాటి పరిస్థితి మరోసారి వస్తే కాంగ్రెస్ సహాయం తీసుకోడానికి వెనుకాడరన్నది యదార్థం. ఈసారి ఢిల్లీలో హంగ్ రాదన్న నమ్మకం కూడా లేదు.


అఖిలేష్ యాదవ్, ఉద్ధవ్ థాక్రే, ఉమర్ అబ్దుల్లా, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ వీళ్ళందరు ఇప్పుడు కాంగ్రెసుకు దూరమవుతున్నారా? నిజానికి కేజ్రీవాల్, మమతా బెనర్జీలు ఇండియా కూటమిలో ఏదో తప్పనిసరిగా వచ్చినవాళ్ళు మాత్రమే. పంజాబ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఈ పార్టీలు కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోటీ చేసిన పార్టీలే. ఈ సారి ఎన్నికల్లో ఢిల్లీలోని 12 శాతం ముస్లిం ఓట్లు ఆప్ కు పడతాయా అంటే అనుమానమేనని కొందరి అభిప్రాయం. ఢిల్లీ అల్లర్లలో కేజ్రీవాల్ వైఖరి, కోవిడ్ కాలంలో తబ్లీగె జమాఅత్ పట్ల ఆయన చూపించిన వ్యవహారశైలి ఇవన్నీ ముస్లిములు మరిచిపోయారనుకుంటే పొరబాటు. ఈ ఓట్లు ఈసారి కాంగ్రెసుకు పడవచ్చు. పంజాబులో కాంగ్రెసు పుంజుకుంది. ఢిల్లీలో శిక్కులు ఎవరికి మద్దతిస్తారో చూడాలి.

కాంగ్రెసేతర పార్టీలు తరచు రాహుల్ గాంధీపై, గాంధీ నెహ్రూ కుటుంబంపై చేస్తున్న విమర్శలు నిజానికి కాంగ్రెసు పట్ల ప్రజల సానుభూతి పెంచడానికి తోడ్పడతాయన్న వాదన కూడా వినిపిస్తుంది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా పాతకాంగ్రెసు మాదిరిగా దృఢంగా వ్యవహరించడం మొదలయ్యింది. రామమందిర ప్రారంభోత్సవం రోజునే దేశానికి నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందని ఆరెస్సెస్ అధినేత చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించిన తీరు దానికి నిదర్శనం. రాహుల్ గాంధీకి దేశంలో జనాదరణ భారత్ జోడో యాత్ర తర్వాత పెరిగిందన్నది కూడా వాస్తవం. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని నిలువరించింది ముఖ్యంగా కాంగ్రెస్ మాత్రమే. ఉత్తరప్రదేశ్‌లో ఈ పని చేసింది అఖిలేష్ యాదవ్. తమిళనాడులో స్టాలిన్.

మహారాష్ట్రలో శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రేల రాజకీయాలు సాధించిందేమిటి? మహారాష్ట్ర ఎన్నికల ఓటమి, హర్యానా ఎన్నికల ఓటమి తర్వాత ఇండియా కూటమి పార్టీలు కాంగ్రెసును విమర్శించడం మొదలయ్యింది. బీహారులో సీట్ల బేరం కోసం తేజస్వీ యాదవ్ కాంగ్రెసుపై ఒత్తిడి తేవాలనుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో కూడా అఖిలేష్ యాదవ్ బహుశా ఇదే ఆలోచిస్తూ ఉండవచ్చు. బాంబే మునిసిపల్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న ఆలోచనతో ఉద్ధవ్ థాక్రే కాంగ్రెసుపై ఒత్తిడి తెస్తున్నారు.

ఏది ఏమైనా, ప్రాంతీయ పార్టీలు తమ ప్రాంతాల్లో పట్టు నిలుపుకోడానికి చేసే ప్రయత్నాల్లో భాగమే ఈ విమర్శలు. కాని ఈ పార్టీలు కూటమిగా ఉండకపోతే ఎదురయ్యే రాజకీయ అణచివేతలను తట్టుకోవడం కూడా సాధ్యం కాదు. ఒత్తిడి రాజకీయాలను ఇప్పుడు కాంగ్రెసు కూడా అర్థం చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. రాహుల్ గాంధీ ఇటీవల ఇలాంటి ఒత్తిళ్ళేవి తనపై పనిచేయవన్న ధోరణిలో మాట్లాడడం కాంగ్రెసులో వచ్చిన ప్రధానమైన మార్పు. కాంగ్రెసులో ఉండి కాంగ్రెసుకు వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న నేతల సంఖ్య తక్కువేమీ లేదు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఇలాంటి నేతలను గుర్తించి వారిని తప్పిస్తే కాని కాంగ్రెసు మళ్ళీ పుంజుకోవడం సాధ్యపడదు.

**కవరు కథనం** | అబ్దుల్ వాహెద్




**కేంద్ర బడ్జెట్** వస్తుందంటే ఎల్లప్పుడూ ఆసక్తి ఉంటుంది. ఈసారి బడ్జెట్ కోసం మరింత ఆసక్తి మాత్రమే కాదు ఆదుర్దా కూడా పెరిగింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఫిబ్రవరిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నారు.

## నేపథ్యం:

ఒకవైపు రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోవడం, ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, చమురు ధరల పెరుగుదల, డిమాండ్ మందగించడం, రెండో త్రైమాసికంలో వృద్ధి తగ్గిపోవడం వంటి నిరాశాజనక పరిస్థితుల నేపథ్యంలో ఈ బడ్జెట్ వస్తోంది. పైగా ఈ నెలలో డొనాల్డ్ ట్రంప్ US అధ్యక్ష పదవిని తిరిగి చేపట్టబోతున్నారు. మరోవైపు యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకోవైపు కాలిఫోర్నియా రాష్ట్రంలో చెలరేగిన కార్చిచ్చు (దావానలం) వల్ల ప్రపంచంపై పడే ఆర్థిక ప్రభావం చర్చనీయాంశంగా మారింది. దానికి తోడు టారిఫ్ యుద్ధాల భయాలు పెరుగుతున్నాయి.

## ట్రంప్ ఎఫెక్ట్:

డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాకముందే కుదుపులు మొదలయ్యాయి. రష్యా నుంచి వస్తున్న చమురుపై అమెరికా ఆంక్షల ఉచ్చు మరింతగా బిగించింది. అంటే రష్యా నుంచి చమురు తీసుకు వస్తున్న ట్యాంకర్లపై కూడా ఆంక్షలు పెట్టింది. దీనివల్ల రష్యా నుంచి మనకు చమురు సరఫరా ఆగిపోయే ప్రమాదం తలెత్తింది. ప్రస్తుతం మనం రష్యా నుంచి దాదాపు 40 శాతం చమురు దిగుమతి చేసుకుంటున్నాం. భారత చమురు కంపెనీల ప్రకారం రెండు నెలల వరకు మనకు ఇబ్బందేమీ ఉండదు. ఈ లోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవచ్చంటున్నారు. కాని ఇదంతా అంత తేలిక కాదు. రష్యా నుంచి చవుకగా లభించే చమురు ఆగిపోతే అధిక ధర చెల్లించి గల్ఫ్ దేశాల నుంచి కొనుగోలు చేయాలి. మరో విషయమేమిటంటే రష్యా నుంచి దిర్హములిచ్చి చమురు కొనగలిగే వాళ్ళం. డాలరు ప్రమేయమే ఉండేది కాదు. డాలరు ప్రమేయం తగ్గిపోతే డాలరు విలువ కూడా పడిపోతుంది. కాని ఇప్పుడు డాలర్లు ఇచ్చి కొనుక్కోవాలి. పైగా డాలరుతో పోల్చితే ఇప్పుడు రూపాయి ధర కూడా చాలా పడిపోయింది. డాలర్లలో చమురు కొనవలసి వస్తే డాలరు విలువ 90 వరకు చేరుకున్నా ఆశ్చర్యం లేదు. మరో వైపు మన ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు వస్తు సేవలపై ఆధారపడి ఉంది,

ఉత్పత్తులపై కాదు. అందువల్లనే జీడీపి పడిపోతుంది. ఉత్పత్తి జరగడం లేదు. మనకు కావలసిన వస్తువులు ఎక్కడి నుంచి వస్తున్నాయంటే అవన్నీ విదేశాల నుంచే వస్తున్నాయి. మన దిగుమతుల్లో 15 శాతం వరకు చైనా నుంచే వస్తాయి. దిగుమతులకు పైకం డాలర్లలోనే చెల్లించాలి. డాలర్లలో చెల్లించి దిగుమతి చేసుకుంటున్నాం కాబట్టి వాటి ధర పెరిగి పోతుంది.

## అమెరికా పెత్తనం

రష్యా నుంచి చవగ్గా చమురు వస్తున్నప్పుడు రిలయన్స్ సంస్థ దాన్ని శుద్ధి చేసి యూరపు దేశాలకు అధికధరకు అమ్ముకుని డబ్బు సంపాదించుకుంది. యూరపు దేశాలు యుక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా నుంచి చమురు డైరెక్ట్‌గా కొనుగోలు చేయలేవు కాబట్టి ఇక్కడి నుంచి కొనుక్కునేవి. యుక్రెయిన్ యుద్ధంలో యూరపు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి. అంతర్జాతీయ మార్కెటులో ఎక్కువ ధర పెట్టి చమురు కొనవలసిన పరిస్థితి వచ్చినప్పుడు సహజంగానే ప్రభుత్వం ఇక్కడ చమురు ధరలు పెంచేస్తుంది. కాని అంతర్జాతీయ మార్కెటులో చమురు ధరలు తగ్గినప్పుడు మాత్రం ఇక్కడ పెట్రోలు, డీజిలు ధరలు తగ్గలేదన్నది మరో మాయా వ్యవహారం. మరోవైపు ఈరాన్ నుంచి కూడా చమురు కొనే పరిస్థితి లేదు. సౌదీ హఠాత్తుగా ఉత్పత్తి పెంచితేనే మనకు సౌదీ నుంచి చమురు దొరుకుతుంది. మరో మార్గం అమెరికా నుంచి కొనుక్కోవడం. మనకు డాలర్లు రావడం తగ్గిపోయి, డాలర్ల ఖర్చు పెరిగిపోతుంది. ఏది ఏమైనా ధరలు పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## విదేశీ పెట్టుబడుల పరిస్థితి:

మరోవైపు షేర్ మార్కెటుపై కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. ఫారిన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ తమ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం ప్రారంభించారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే, ట్రంప్ అధికారంలోకి వస్తాడన్న వార్తే దీనికి కారణం అంటు న్నారు. ప్రస్తుతం అమెరికాలో భారతీయుల పట్ల వ్యతిరేకత పెరుగుతోంది. ఇటీవల యాపిల్ కంపెనీ అనేకమంది భారతీయులను ఉద్యోగాల నుంచి తొలగించింది. తెలుగు సంఘం తానాకు కాలిఫోర్నియా కోర్టు నోటీసులు పంపించింది. భారతీయుల పట్ల అమెరికాలో వ్యతిరేకతకు చాలా కారణాలుండవచ్చు. అక్కడ భారతీయుల సంఖ్య పెరగడం కూడా చాలా మందికి నచ్చడం లేదు. తమ ఉద్యోగాలను లాక్కుంటున్నా రన్న కోపం ఉంది. ట్రంప్ విదేశీయులకు ఉద్యోగాలిచ్చే కన్నా ముందు అమెరికన్లకు ఉద్యోగాలివ్వాలని అన్నాడు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులందరినీ వెనక్కు పంపేస్తానని ట్రంప్ అంటున్నాడు. టారిఫ్‌లు పెంచుతానని అంటున్నాడు. ట్రంప్ ప్రమాణ స్వీకారానికి కూడా భారత ప్రధానికి ఆహ్వానం అందలేదు. దీన్నిబట్టి ట్రంప్ వైఖరి ఎలా ఉండబోతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యం కారణంగానే విదేశీ మదుపరులు తమ డబ్బు వాపసు తీసుకుంటున్నారని విశ్లేషకుల అభిప్రాయం. మరోవైపు ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్టర్లు కూడా తమ పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో ట్రంప్ రావడం వల్ల తలెత్తిన ఈ పరిస్థితులకు తోడు దేశంలో పరిస్థితులు కూడా ఆశావహంగా లేవు. రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. విదేశీ మదుపరులు ఇక్కడ పెట్టుబడి డాలర్లలో తెస్తారు. కాని రూపాయిల్లో మార్చి పెట్టుబడి పెడతారు. రూపాయి విలువ పడిపోవడమంటే వారి పెట్టుబడి విలువ తగ్గడమే అవుతుంది. ఇది కూడా విదేశీ మదుపరులకు నిరాశాజనకమైన విషయం. వీటన్నింటి వల్ల షేర్ మార్కెటులో అస్థిరత కనిపిస్తుందని కొందరి అభిప్రాయం.

## ప్రస్తుత పరిస్థితి

ఈ నేపథ్యంలో బడ్జెటు రానుంది. మన దేశంలో 54 శాతం ప్రజలు వ్యవసాయంలో పెట్టుబడి పెడతారు. కాని జీడీపీలో దాదాపు 17 శాతానికి మించి వ్యవసాయం కనిపించదు. పైగా రైతుల సమస్యలున్నాయి. గిట్టుబాటు ధర కోసం రైతులు ఉద్యమిస్తున్నారు. ఆందోళనలు చేస్తున్నారు. అంటే అర్థమేమిటి? దేశంలో అత్యధికశాతం మంది ఏ పని చేస్తున్నారో ఆ పని వల్ల జీడీపీలో పెద్దగా వృద్ధి వచ్చే అవకాశం లేదు. అంటే పేద వాళ్ళు మరింత పేదలు, సంపన్నులు మరింత సంపన్నులయ్యే పరిస్థితి ఉంది. జీడీపీ పతనమవుతుందన్న అంచనాలు వచ్చాయి. అంటే ప్రభుత్వం టాక్స్ వసూళ్ళు తగ్గుతాయి. దీనికి కారణమేమంటే, ప్రజల్లో కొనుగోలు శక్తి లేకపోతే ఉత్పత్తులను కొనేవారు ఉండరు. ఆటోమొబైల్ పరిశ్రమలో ఈ పరిస్థితి మనం చూడవచ్చు. వాహనాల అమ్మకాలు చాలా తగ్గిపోయాయి. 2024లో 12 శాతం అమ్మకాలు పడిపోయాయి. నేచురల్ గ్యాస్ అమ్మకాలు కూడా పడిపోయాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. 2 నుంచి 5 కోట్ల రూపాయల విలువగల లగ్జరీ గృహాల అమ్మకాలు 82 శాతం పెరిగాయి. కాని కోటి రూపాయల కన్నా తక్కువ విలువగల ఉన్నత మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజలు కొనుక్కునే గృహాల అమ్మకాలు పడిపోయాయి. దీనివల్ల తెలిసేదేమిటి? ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. ఉత్పత్తులను కొనేవారు లేకపోతే అమ్మకాలు ఉండవు. జియస్టీ నుంచి వచ్చే ఆదాయం

ప్రభుత్వానికి ఉండదు. ధరల పెరుగుదల కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం చెల్లించే డిఏ పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు వస్తారు?

ఈ పరిస్థితులను చూస్తుంటే 2025 ఎలా ఉంటుందో అని చాలా మంది ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక అంచనాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత GDP 6.4% స్థాయికి తగ్గిపోతుందని అంచనా. ఇది 2023-24లో నమోదైన 8.2% వృద్ధి కంటే గణనీయంగా తక్కువ. రియల్ ఎస్టేట్ రంగం ఉపశమనం కోసం ఎదురు చూస్తోంది. స్టార్టప్స్ మద్దతు కోరుతున్నాయి. ప్రపంచం కోవిడ్-19 మహమ్మారిని అధిగమించినా, HMPV ఇన్ఫెక్షన్లు తాజా అలజడులకు కారణమవుతున్నాయి. ఆరోగ్య రంగం వ్యవస్థలోని లోపాలను చక్కదిద్దడానికి మరిన్ని పెట్టుబడులు, పటిష్ట విధానాలు అవసరం.

## సవాళ్ళు

జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి 5.4% స్థాయికి తగ్గింది. ఇది ఏడాదిలోని ఏడు త్రైమాసికాల్లో కనిష్టం. ఏడుశాతం కంటే ఎక్కువ వృద్ధిని అంచనా వేసిన విశ్లేషకులను ఈ అనూహ్య తగ్గుదల నిర్ఘాంతపరిచింది. ఫలితంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వృద్ధి అంచనాను 7.2% నుండి 6.6%కి తగ్గించింది. బ్లూమ్‌బర్గ్ సర్వేలో పాల్గొన్న 44 మంది ఆర్థిక నిపుణులలో ఒక్కరు కూడా ఇంత మందగింపు అంచనా వేయలేదు. రాయిటర్స్ సర్వే 6.5% నుంచి 6.7% మధ్య మందగింపు సూచించింది.

రెండవ త్రైమాసిక డేటా చూస్తే భారత వృద్ధి వేగం మందగించిందన్నది స్పష్టమయ్యింది. వేతనాలు తగ్గిపోతున్నాయి, కంపెనీల లాభాలు పతనమవుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఉత్పాదక రంగంలో వృద్ధి గత త్రైమాసికంలో 7% నుండి, ఈసారి 2.2% కు గణనీయంగా తగ్గింది. మైనింగ్ ఉత్పత్తి స్వల్పంగా తగ్గింది. సేవల రంగం సవ్యంగా ఉన్నప్పటికీ, మునుపటి అంచనాలతో పోలిస్తే తక్కువ వృద్ధిని చూపింది. ప్రైవేట్ వినియోగ వ్యయం మొదటి త్రైమాసికంలో 7.4% నుండి రెండవ త్రైమాసికంలో 6%కు తగ్గింది. నగర ప్రాంతాల్లో అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణంతో కుటుంబాలు ఇబ్బంది పడుతున్న కారణంగా మార్కెటులో కొనుగోలు శక్తి క్షీణించింది.

## ఉపయుక్త సూచనలు

ఈ నేపథ్యంలో జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుసైని ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పిన మాటలకు ఎంతైనా ప్రాముఖ్యం ఉంది. ఆయన కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి నిర్మాణాత్మకమైన సమగ్ర సూచనలు ఇచ్చారు. పట్టణ నిరుద్యోగాన్ని నివారించడానికి మన్రేగా (గ్రామీణ ఉపాధి హామీ పథకం) తరహా కార్యక్రమాన్ని సూచించారు.

మీడియాతో మాట్లాడుతూ, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అసమానతలు, పేదరికం వంటి సమస్యలను పరిష్కరించే విధంగా 2025-26 కేంద్ర బడ్జెట్ రూపొందించాలని అన్నారు. దేశంలో 45% యువత నిరుద్యోగులుగా ఉన్నారు. 20% జనాభా పేదరికంలో మగ్గుతోంది. వ్యవసాయ వృద్ధి 2.8%. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం విధానాలను పునస్సమీక్షించాలని, వ్యాపార ప్రధాన విధానాల నుండి పౌర ప్రధాన విధానాలకు మరలాలని అన్నారు. దీనివల్ల సంక్షేమం పెరుగుతుందని, డిమాండ్ పెరుగుతుందని, ప్రజల చేతుల్లో డబ్బులు వస్తే కొనుగోలు శక్తి పెరుగుతుందని, సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సామాజిక భద్రతా పథకాలు అమలు చేసి, బడుగు బలహీనవర్గాలకు, మైనారిటీ వర్గాలకు ఆర్థిక న్యాయం చేయాలన్నారు. ప్రాధాన్యత ఉన్న రంగాలకు కేటాయింపులను పెంచాలని, మన్రేగా బడ్జెట్ కోతలను తొలగించి, పట్టణ నిరుద్యోగాన్ని నివారించడానికి మన్రేగా తరహా కార్యక్రమాలను ప్రవేశపెట్టాలన్నారు. గ్రామీణ ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఆరోగ్యరంగానికి GDPలో 4%, విద్యా రంగానికి 6%కి పెంచాలని చెప్పారు. ఇది "మిషన్ శిక్షా భారత్" కింద సమగ్రంగా అమలు చేయాలని సూచించారు.

మైనారిటీలు, ఎస్సీ/ఎస్టీ వర్గాల విద్యాభివృద్ధి కోసం స్కాలర్‌షిప్పులు పునరుద్ధరించాలని కోరారు. నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పనావకాశాలు పెంచాలని చెప్పారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం రుణ మాఫీ, గిట్టుబాటు ధర, సాగు నీటిపథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారికి యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (UBI)ను దశలవారీగా అమలు చేయాలని సూచించారు. నిత్యావసర వస్తువులపై GSTని 5% మించకుండా చూడాలని, రాష్ట్రాల వాటాను పన్నుల్లో 50%కి పెంచాలని, CSR నిబంధనలను పటిష్టం చేయాలని జమాఅత్ అధ్యక్షుడు చేసిన సూచనలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఆలోచించదగినవి. ✤




# HMPV వైరస్ ప్రమాదకరం కాదు

**Dr. ఎన్. ఖలీల్**

ఓ రోజు యధావిధిగా మా అమ్మాయి స్కూల్ నుంచి ఇంటికి వచ్చిందే తడవుగా నాతో "నాన్నా స్కూల్‌కి రేపటి నుంచి మాస్క్ పెట్టుకుని రావాలి" అంది. ఎందుకు అని ప్రశ్నిస్తే ఏదో HDFC వైరస్ వచ్చిందని చెప్పింది. అది HDFC కాదు HMPV అని వివరంగా చెప్పి... ఎందుకో దీని మీద ఒక అవగాహన ఇవ్వడం మంచిదనిపించి....

## సరే అసలు విషయానికి వెళ్దామా మరి...

జాగ్రత్తలు తీసుకోవడానికి భయపడడానికి చాలా వ్యత్యాసం ఉంది. ఏ వైరస్ ప్రజారోగ్యంపై దాడి చేసినా దాన్ని నియంత్రించేందుకు, నిరోధించేందుకు చర్యలు తీసుకో వాల్సిందే. ప్రభుత్వం సహా వైద్య నిపుణులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాల్సిందే. కానీ జాగ్రత్తల పేరుతో భయపెట్టడం, భయపడడం ఏమాత్రం సమంజసం కాదు. ప్రస్తుతం చైనాలో వెలుగులోకి వచ్చిన హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) భారత్‌లోకి ప్రవేశించిందనే వార్తలు కలవరపరుస్తున్నాయి. చైనా పొరుగుననే ఉన్న మరికొన్ని దేశా లకు కూడా ఇది విస్తరిస్తున్నట్లు చెబుతున్నారు. శీతల ప్రాంతం ఉన్న దేశాల్లో ఈ వైరస్ ఎక్కువగా విస్తరిస్తుందని, చైనాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ వైరస్ సోకుతూనే ఉన్నది. అదే వైరస్ తాజాగా భారత్‌లోకి విస్తరించింది. గుజరాత్, కర్ణాటక, తమిళనాడుల్లో తొలి కేసులు గుర్తించారు. దీంతో దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది. అయితే దీనిపై ప్రజలు ఎంత మాత్రం ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. బెంగళూరు లోని ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకినట్లు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుర్తించారు. వాస్తవంగా మూడు నెలల ఆడ శిశువును తొమ్మిది నెలల మగశిశువును శ్వాసకోశ సంబంధిత సమస్యలతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. వీరిలో హెచ్ఎంపీవీ ఉన్నట్లు సాధారణ ఆరోగ్య పరీక్షల్లో వెలుగు చూసింది. అయితే అందులో మూడు నెలల చిన్నారి అప్పటికే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా మరొకరు కోలుకుంటున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. దేశంలో తొలి హెచ్ఎంపీవీ కేసులు ఇవేనని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్) ప్రకటించింది. చెన్నైలో మరో ఇద్దరు శిశువులకు ఈ వైరస్ సోకినట్లు గుర్తించారు. జలుబు, జ్వరం, దగ్గు, తదితర అస్వస్థతలతో ఆస్పత్రిలో చేరిన వారికి నమూనాలు సేకరించి పరీక్షించగా బయటపడింది. ఇక రాజస్థాన్‌కు సంబంధించిన రెండు నెలల శిశువును గుజరాత్, అహ్మదాబాద్లో గత నెల చివరి వారంలో ఆస్పత్రిలో చేర్చగా ఈ వ్యాధి ఆ శిశువుకు సోకినట్లు వెలుగు చూసింది. ఈ శిశువుల కుటుంబ సభ్యులు ఎవరూ విదేశాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. అయితే వీరికి ఈ వ్యాధి ఎలా? ఎక్కడ నుంచి సోకిందనేది అంతుచిక్కని

ప్రశ్నగా మిగిలి పోతున్నది. వైద్యనిపుణులు కూడా దీనిపై ఇంకా స్పష్టమైన సమాచారం ఇవ్వలేకపోతున్నారు. అయితే ఈ వైరస్ కొత్తదేమీ కాదని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా ప్రకటించారు. పరిస్థితిని ఆరోగ్య శాఖతోపాటు ఐసీఎమ్ఆర్, ఎన్సీడీసీ విభాగాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయని ఆయన వివరించారు. నిజానికి ఈ వైరస్ 2001లోనే గుర్తించారని చాలా యేళ్లుగా ఇది ప్రపంచవ్యాప్తంగా సోకుతూనే ఉందని, గాలి, శ్వాస ప్రక్రియ ద్వారా వ్యాపిస్తుందని చెప్పారు. వీరూవారు అని లేకుండా అన్ని వయస్సుల వారికి ఇది సోకుతుందన్నారు. ముఖ్యంగా శీతాకాలం, వసంత రుతువు ప్రారంభంలో వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని ఇటీవల చైనాలో పెరుగుతున్నట్లు స్పష్టం చేశారు. కానీ మనదేశంలో శ్వాసకోశ వైరస్‌ల డేటాను సంబంధిత విభాగాలు సమీక్షించగా సాధారణ వ్యాధికారక వైరస్లలో ఏ విధమైన పెరుగుదల లేదని స్పష్టం చేశారు. అయినా దేశంలోని ఆరోగ్యవ్యవస్థలు, నిఘా నెట్‌వర్కు అప్రమత్తంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. మరొకపక్క శ్వాసకోశ సంబంధిత సీజనల్ కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయని, కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ ప్రకటించారు. శీతాకాలంలో తగు జాగ్రత్తలు వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే ఈ వైరస్ గురించి సామాజిక మాధ్యమాల్లో రకరకాల వార్తలు వెలు వడుతున్నాయి. కొందరు తెలిసీతెలియని మిడిమిడి జ్ఞానంతో వైద్యులమని చెప్పుకుంటున్నా కొందరు చేస్తున్న ప్రచారం అమాయకులను ఆందోళనకు గురిచేస్తున్నది. ముఖ్యంగా కరోనా రక్కసి విజృంభించిన కాలంలో మొదట్లో పాలకులు అంతగా శ్రద్ధతీసుకోకపోవడం వల్ల అది విస్తరించి అదుపు తప్పిపోయింది. ఆనాడు ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ రంగం, ఆ రంగం అని కాదు. అన్ని రంగాలపై ఆ ప్రభావం చూపింది. కరోనాపై యుద్ధం ముగిసిన తర్వాత ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలనే ఆందోళన అందరిలోనూ నెలకొన్నది. కరోనా కూడా చైనాలోని వ్యూహాన్ నగరంలో పుట్టి చాప కింద నీరులా ప్రపంచ దేశాలకు విస్తరించింది. 2020 జనవరి 20 నాటికి ఈరక్కసి జనంపై విజృంభించడంతో ప్రపంచానికి తెలిసింది. భారత్‌కు సంబంధించి మొట్టమొదటి కేసు జనవరి చివరివారం కేరళ రాష్ట్రంలో బయటపడింది. ఇంతటి తీవ్రత చూపుతున్నదని ఆనాడు ఊహించలేకపోయారు. మార్చి మూడో తేదీ నాటికి కానీ ఆ వ్యాధి తీవ్రత గురించి కేంద్రం గుర్తించలేకపోయింది. ఢిల్లీలో జరిగిన సమావేశం తర్వాత నుండే చర్యలు చేపట్టి ఉంటే అంత భారీగా నష్టం జరిగేది కాదని వైద్యరంగ నిపుణులు ఆనాడే అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశంలోకి ప్రవేశించిన హెచ్ఎంపీవీ వైరస్ అంత ప్రమాదకారి కాదని వైద్యనిపుణులు పాలక పెద్దలు చెప్తున్నా కరోనా సృష్టించిన బీభత్సంతో భయాం దోళనలు వ్యక్తం అవుతున్నాయి. దీనిని సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు, నకిలీ వైద్యులు రకరకాల ప్రచారాలు చేస్తున్నారు. వారి బారిన పడి అటు ఆరోగ్యంగా, ఇటు ఆర్థికంగా నష్టపోకుండా కాపాడడమేకాక ప్రభుత్వంలోని వైద్యరంగానికి మౌలిక వసతులను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.

★★★


సమాజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహాలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# కంటి "పాప"లు.. ఇంటి వెలుగులు

- ముహమ్మద్ ముజాహిద్




జాతీయ బాలికల దినోత్సవం (జనవరి 24) సందర్భంగా

- ఆడ పిల్లలు అల్లాహ్ కారుణ్యానికి ప్రతిరూపాలు
- అయినా భ్రూణ హత్యలు సాగడం ఆందోళనకరం
- మారకుంటే ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు

"అమ్మా.. నన్ను చంపొద్దు. నేను ఇప్పుడే నీ గర్భంలోకి వచ్చాను. అప్పుడే మీరంతా నా మరణ శాసనాన్ని రాసేస్తున్నారు. అమ్మా... నాకు బతకాలనుంది. ఈ విశాల ప్రపంచాన్ని చూడాలని ఉంది. నీ మీద ఒట్టేసి చెబుతున్నా... నేనెప్పుడూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. మీరంతా తిన్నాకే నేను తింటాను. నాన్న..
నా స్కూలు ఫీజు గురించి, పుస్తకాల గురించి బెంగ పెట్టుకోవద్దు. అన్నయ్య పుస్తకాలతో ఇంట్లోనే చదువుకుంటాను. నాన్నా, నా పెళ్లి గురించి చింతించకు. పెళ్లి చేసుకోకుండా జీవితాంతం నీతోడుగా ఉంటాను."

అమ్మ కడుపులోని ఓ ఆడ శిశువు ఆత్మ ఘోష ఇది. వారి భ్రూణ హత్యల నివారణకు యూట్యూబ్‌లో ఉన్న ఓ ప్రచార లఘు చిత్రం ఆవేదన ఇది. మనదేశంలో ఆడ శిశువుల దుస్థితికి దర్పణం పట్టే వాస్తవ వేదన ఇది.

ఆడపిల్లను ఇంటి దీపంగా భావించిన ఇస్లాం, భారతీయ సంస్కృతిని మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. నాగరిక సమాజమని చెప్పుకుంటున్న మనం నేడు తల్లి కడుపులోనే ఇంటికి వెలుగును ప్రసాదించే కూతుళ్లను సమాధి చేస్తున్నాం. ఆడ పిల్ల పుడితే ముఖం మాడ్చుకునే తల్లిదండ్రులు ఇంకా మనకు కనిపిస్తున్నారు. ఆడ పిల్లల్ని కంటే భార్యలను వదిలేస్తున్న భర్తలూ ఈ దేశంలో ఉన్నారు. ఆడపిల్లను గుండెల మీద కుంపటిగా భావించే తండ్రులూ ఉన్నారు. ఆడ పిల్ల పెళ్లికి పైసా పైసా కూడబెట్టాలి అని ఆలోచనలను ఇంకా చేస్తున్నారు.

## ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి

నేను హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణం చేసిన ప్రతిసారి రెండు అర చేతుల్లో ఒదిగి ఉన్న ఆడ శిశువు "ఆడపిల్లల్ని కాపాడండి" అని అర్థిస్తూ ఉన్న పోస్టర్ కనిపిస్తుంది. ఆ పోస్టర్‌ను చూసినప్పుడల్లా నా అంతరంగంలో అంతులేని ఆవేదన కన్నీరై ప్రవహిస్తుంది. కృత్రిమ మేధ లాంటి అత్యాధునిక సాంకేతికతను వాడుతున్న మనం, నిమిషాల్లో రోదసిలోకి రివ్వున దూసుకెళ్లే రాకెట్లను తయారు చేస్తున్న మనం... ఆడ శిశువుల భ్రూణ హత్యలను తగ్గించడంలో మాత్రం రాకెట్ వేగాన్ని అందుకోలేక పోతున్నాం. మన దేశంలో ఎన్నో ఏండ్లుగా స్త్రీ పురుషుల

సమతుల్యంలో చాలా వ్యత్యాసం ప్రమాదఘంటికలు మోగి స్తోంది. ప్రస్తుతం దేశంలో వెయ్యి మంది పురుషులకు కేవలం 943 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చా లంటే ఆడపిల్లలను బతికించుకోవాలి. నేటికీ మన దేశంలో రోజూ సుమారు 2వేల స్త్రీ శిశు గర్భస్రావాలు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. పరిస్థితి ఆందోళకరంగానే ఉంది. ప్రభుత్వ జనన రిజిస్ట్రేషన్ల డేటా ప్రకారం 2016లో తెలంగాణలో ప్రతి 1000 మంది బాలురకు 877 బాలికలు ఉన్నారు. 2024 ప్రపంచ లింగ వ్యత్యాస సూచీ ప్రకారం మన దేశం 146 దేశాల్లో అట్టడుగున 129వ స్థానంలో నిలిచింది. పరిస్థితి చేయి జారి పోతుండటంతో 2014లోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'బేటీ బచావో.. బేటీ పడావో' అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. అంటే ఆడ బిడ్డల్ని కాపాడుకుందాం.. ఆడ బిడ్డల్ని చదివించు కుందామని దేశ ప్రజలను అర్థించే దుస్థితిలో ఉన్నామని మోదీ ప్రభుత్వం తెలిపింది. ఆడ పిల్లలు తక్కువగా ఉండే వెయ్యి జిల్లాలలో బాలికల సంఖ్య పెరిగేలా చూడటం, ఐదేళ్ల లోపు సంభవించే శిశు మరణాల రేటును 8 శాతం నుంచి 5 శాతా నికి తగ్గించడం, ఆడపిల్లల్ని లైంగిక వేధింపుల నుంచి కాపాడటం బేటీ బచావో.. బేటీ పడావో పథకం లక్ష్యాలు. ఇలాంటి ఎన్నో పథకాలు పలు రాష్ట్రాల్లో ఎన్ని అమలవుతున్నా ఆడ పిల్లల జనాభాలో ఆశించినంత పెరుగుదల కనిపించడం లేదు. ఆడ పిల్లలకున్న భద్రతలోనూ పెద్దగా మార్పు లేదు. మరోవైపు కేంద్రం, పలు రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాల మాటలకు, చేతలకు పొంతన కుదరడం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, ముస్లిం బాలికలపై జరుగుతున్న అత్యా చారాలు, హత్యల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ అపకీర్తి ప్రపంచ దేశాల ముందు మనకు తలవంపులు తెస్తున్నది.

## ప్రవక్త(స) మార్చిన పరిస్థితి మళ్లీ రావాలి

ముహమ్మద్ ప్రవక్త మహనీయులు ప్రవక్త పదవి చేపట్టక ముందు కూడా ఆనాటి అరబ్బు సమాజంలోనూ ఆడపిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేది. ఆడకూతురు పుడితే సజీవంగా పూడ్చిపెట్టేవారు. ఆడ పిల్ల తండ్రి సిగ్గుతో, నామోషీతో తల దించుకునేవాడు. అయితే ప్రవక్త (స) తెచ్చిన దేవుడొక్కడేననే నినాదం ఆనాటి ప్రజల్లో ఎంతో మార్పు తీసుకువచ్చింది. ఆడ పిల్లల్ని మట్టుబెట్టిన దండ్రులు కుమిలిపోయేలా వాళ్లల్లో పరివర్తన తీసుకువచ్చింది. ప్రవక్త (స) ఆడ బిడ్డల పెంపకాన్ని స్వర్గానికి వారధిగా చేశారు. "మీ ఆడబిడ్డలు రేపటి రోజున నరకానికి అడ్డుగోడలవుతారని, ఆడబిడ్డలే స్వర్గానికి బాటలవుతారు" అని ప్రవక్త(స) చెప్పారు. ఆడ పిల్లల విషయంలో దైవానికి భయ పడాలంటూ ఖుర్ఆన్ హెచ్చరిక చేస్తోంది. ఆడ పిల్లల పట్ల వివక్ష చూపినా, ఆడ పిల్లలకు వాళ్లకు రావాల్సిన హక్కును కాజేసినా, వాళ్లను అన్యాయంగా హతమార్చినా ఆ దేవుని పట్టు నుండి ఎవ్వరూ తప్పించుకోలేరంటోంది ఖుర్ఆన్. ముహమ్మద్ ప్రవక్త (స) తన నలుగురు కుమార్తెలను ఎంతో అల్లారు ముద్దుగా పెంచి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

## అల్లాహ్ ప్రీతిపాత్రులం కావాలంటే...

ఆడ పిల్లలు లేకుంటే సృష్టి ముందుకు నడవదు. మనల్ని కని పెంచిన అమ్మ, మనల్ని కంటికి రెప్పలా చూసుకొనే భార్య కూడా ఒకరికి కూతురిగా జన్మించిన ఆడబిడ్డేనని తెలుసుకోవాలి. ఓ పెండ్లయిన జంటకు ఎన్ని ఆస్తుపాస్తులున్నా, ఇంట్లో ఆడ కూతురు లేకపోతే ఆ ఇల్లు దీపంలేని ఇల్లులా కళా విహీనంగా ఉంటుంది. ఆడపిల్లలు తల్లిదండ్రుల కష్టసుఖాలను ఎంతో పరిణితితో అర్థం చేసుకొని వారికి తమ వంతు సాయం చేస్తారు. ఇంటి ముందు ఆడుకొనే చిన్నారి బాలికలు దైవ దూతల మాదిరి మన గృహాలకు శోభ తెస్తారు. ఆడపిల్లలు పద్ధతిగా పెరిగి... కన్నవారికి తలవంపులు తేకుండా ప్రవర్తిస్తారు. అలాంటి ఆడ పిల్లలకు ఇస్లాం ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ఎవరికైనా కూతురు పుట్టిందంటే ఆ తండ్రిని అల్లాహ్ ఎంతో ఇష్టపడుతున్నా డని అర్థం. అల్లాహ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రబోధించారు. అందుకే దేవుని కారుణ్యానికి ప్రతిరూపాలైన ఆడ పిల్లలను పురిట్లోనే చంపకుండా పెంచి పెద్ద చేద్దాం. వారిని అబ్బాయిలతో సమానంగా పెంచి పోషిద్దాం. వారి ఆసక్తి మేరకు ఉన్నత చదువులు చదివిద్దాం. లింగ సమానత్వానికి ప్రాధాన్యత ఇచ్చి.. లింగ వ్యత్యాసాలను రూపుమాపుదాం. అమ్మాయిల మోముల్లో నవ్వులు నింపి అవనికి వెలుగులు తీసుకొద్దాం.

★ ★ ★






**హిబా అర్జుమంద్ ఖాన్**

**దైవ ప్రవక్త ముహమ్మద్ (స)** వారి జీవితంలో జరిగిన అనేక ముఖ్య సంఘటనల్లో 'మేరాజ్' కూడా ఒకటి. ముస్లిం సమాజంలో దీనికి చాలా ప్రాముఖ్యం ఉంది. అరబీ భాషలో మేరాజ్ అంటే నిచ్చెన అని అర్థం. మక్కా నుండి, మస్జిదె అక్సా వరకు బుర్రాఖ్ ప్రయాణం ముగిసిన తరువాత దైవప్రవక్త ముహమ్మద్ (స) నిచ్చెన మార్గం ద్వారా ఆకాశ ప్రయాణం చేశారు. అందుకే దీనికి 'మేరాజ్' అని పేరొచ్చింది. ఈ మేరాజ్ యాత్రలో దైవం ఆయనకు 50 పూటల నమాజుతో పాటు, బఖరా సూరాలోని చివరి రెండు ఆయతులు, పాపక్షమాపణకు సంబంధించిన శుభవార్తను కానుకగా బహూకరించాడు. ప్రవక్త మహనీయులు మహదానందంతో తిరిగొస్తుండగా, హజ్రత్ మూసా అలైహిస్సలాం తారసపడి, సంతోషానికి కారణమేమిటని అడిగారు. ప్రవక్త మహనీయులు పరమ సంతోషంతో కానుకల గురించి వివరించారు. అప్పుడు హజ్రత్ మూసా(అ) 'మీ అనుచరులు 50 పూటల నమాజును ఆచరించలేరు. మీరు వెనక్కివెళ్ళి ఈ సంఖ్యను తగ్గించుకు రండి' అని సలహా ఇచ్చారు. దీంతో ముహమ్మద్ ప్రవక్త(స) దేవుని వద్దకు వెళ్ళి నమాజుల సంఖ్యను తగ్గించవలసిందిగా వేడుకున్నారు. అప్పుడు దైవం కొన్ని నమాజులను తగ్గించాడు. అయినా హజ్రత్ మూసా (అ), 'మీ అనుయాయులు ఇవి కూడా చెయ్యలేరు, ఇంకా తగ్గించుకు రండి' అని చెప్పారు. ఈ విధంగా ముహమ్మద్ ప్రవక్త వెళ్ళి తగ్గించుకురావడం, మూసా ప్రవక్త ఇవి కూడా ఎక్కువే ఇంకా తగ్గించుకురండి అని వెనక్కి పంపడం జరిగి, చివరికి ఐదు నమాజులు మిగిలాయి. అయినా మూసా అలైహిస్సలాం ఇంకా తగ్గించుకు రమ్మన్నారు. కాని ప్రవక్త మహనీయులు 'ఇక నేను వెళ్ళలేను. ఇప్పటికే చాలాసార్లు వెళ్ళి తగ్గించుకొని వచ్చాను. మళ్ళీ వెళ్ళడానికి నాకు సిగ్గుగా ఉంది. ఈ ఐదు నమాజులు నాకు సమ్మతమే, సంతోషమే' అన్నారు. అప్పుడు, 'ఎవరైతే ఈ ఐదు నమాజులు సక్రమంగా నెరవేరుస్తారో వారికి 50 పూటలు నమాజు ఆచరించినంత పుణ్యఫలం ప్రసాదించబడుతుంది' అన్న శుభవార్త వినిపించబడింది. ఈ గగన యాత్రలో ముహమ్మద్ ప్రవక్త (స) ఇంకా అనేక సంఘటనలు, విశేషాలను వీక్షించారు. ఒకచోట కొందరు వ్యక్తులు ఒక పంటను కోస్తున్నారు. అయితే ఆ పంట కోస్తున్నకొద్దీ తరగడం కాకుండా పెరగడం చూసి, 'ఏమిటీవింత?' అని జిబ్రీల్ అలైహిస్సలాంను అడిగారు. 'వీరు దైవ మార్గంలో తమ సర్వస్వాన్నీ త్యాగం చేసిన వారు' అని చెప్పారు హజ్రత్ జిబ్రీల్. మరొకచోట కొందరు వ్యక్తులు అతుకుల బొంతలు ధరించి పశువుల్లాగా గడ్డి మేస్తు న్నారు. ఇది చూసిన ప్రవక్త(స) వీరెవరని ప్రశ్నించారు. 'వీరు తమ సంపద నుండి జకాత్ (పేదలకు చెందాల్సిన ఆర్థిక దానం) చెల్లించని వారు' అని చెప్పారు.

ఇంకొకచోట కొందరి తలలను బండరాళ్ళతో చితగ్గొట్టడం జరుగుతోంది. ఈ దృశ్యాన్ని చూసి, 'మరి వీళ్ళెవరు?' అని ప్రశ్నించారు ప్రవక్త మహ నీయులు. వీరు నిద్రమత్తులో జోగుతూ దైవారాధనకు బద్ధకించేవారు' అని సమాధానం చెప్పారు జిబ్రీల్.

మరొకచోట ఒక మనిషి కట్టెల మోపు ఎత్తడానికి విఫల యత్నాలు చేస్తూ, అందులోంచి కొన్ని కట్టెలు తీసి తేలిక పరుచుకునే బదులు, అదనంగా మరికొన్ని కట్టెల్ని కలిపి మోపు కడుతున్నాడు. ముహమ్మద్ ప్రవక్త(స) ఈ వింతను చూసి, ‘ఈ మూర్ఖుడెవరు?’ అని అడిగారు. ఈ వ్యక్తి శక్తికి మించిన బాధ్యతలు మీదేసుకొని కూడా, వాటిని తగ్గించుకునే బదులు మరికొన్ని బాధ్యతలు భుజాన వేసుకునేవాడు.’ అని బదులిచ్చారు హజ్రత్ జిబ్రీల్.

అలాగే మరొక చోట కొందరు వ్యక్తుల పెదవులు, నాలుకలు కత్తెర్లతో కత్తిరించబడు తున్నాయి. ఇది చూసిన ప్రవక్తవారు, ‘ఇదేమిటీ?’ అని ప్రశ్నించారు. ‘వీరు బాధ్యత మరచిన ఉపన్యాసకులు.’

బాధ్యతారహిత ప్రసంగాలతో ప్రజల్ని రెచ్చగొట్టి చిచ్చుపెట్టేవారు, వారి మధ్య కలహాలు రేకెత్తించేవారు’ అన్నారు జిబ్రీల్. ఇదే విధంగా ఇంకోచోట, బండరాయికి ఒక సన్నని రంధ్రం ఏర్పడి, అందులోంచి బాగా బలిసిన ఒక ఎద్దు బయటికొచ్చింది. అయితే అది మళ్ళీ ఆ సన్నని రంధ్రంలో దూరడానికి ప్రయత్నిస్తోంది, కాని విఫలమవుతోంది. ఇది చూసిన ప్రవక్త మహనీయులు ‘మరి ఈ వ్యవహారం ఏమిటి?’ అని ప్రశ్నించారు. దానికి జిబ్రీల్ దూత, ‘ఇది బాధ్యతారహితంగా, సమాజంలో కల్లోలం రేకెత్తే విధంగా మాట్లాడి, తరువాత పశ్చాత్తాపం చెందే వ్యక్తికి సంబంధించిన దృష్టాంతం’ అని చెప్పారు. కొందరు వ్యక్తులు అనాలోచితంగా మాట్లాడి, తరువాత సరిదిద్దుకోడానికి, లేక ఆ మాటను ఉపసంహరించుకోడానికి ప్రయత్ని స్తారు. కాని నోరుజారిన తరువాత ఇక అది సాధ్యంకాదు కదా! మరోచోట, కొందరు స్వయంగా తమ శరీర భాగాలను కోసుకొని తింటున్నారు. ‘మరి వీరెవరూ?’ అని ప్రశ్నించారు ప్రవక్త(స). ‘వీరు ఇతరులను ఎగతాళి చేసేవారు, అవమానించేవారు, సాటి మనుషుల్ని తక్కువగా చూసేవారు’ అని చెప్పారు జిబ్రీల్. కొంతమంది ఫోవాతంతో శరీరంలో సగభాగం పడిపోయిన వారిలాగా కనిపించారు. ‘ఇది దేనికి సంకేతం?’ అని ప్రవక్త (స) ప్రశ్నించగా, ‘వీరు భార్యల మధ్యన సమత్వం సమతూకం పాటించనివారు. ఒక భార్య వైపునకు పూర్తిగా మొగ్గిపోయి, మరో భార్యను ఉపేక్షించిన వారు అని దైవదూత బదులిచ్చారు.

మరికొంతమంది ముందు వేయించిన తాజా మాంసం ఉంచబడగా వారు తినకుండా, కుళ్ళు కంపు కొడుతున్న మాంసాన్ని భక్షిస్తున్నారు. ‘ఈ వైనం ఏమిటి?’ అని దైవప్రవక్త (స) అడగ్గా, ‘వీరు శీలవతులైన తమ భార్యలు ఉండగా, వారితో తృప్తి చెందకుడా పరాయి స్త్రీల ద్వారా కామవాంఛ తీర్చుకునేవారు’ అని దైవదూత బదులిచ్చారు.అలాగే రకరకాల శిక్షలు అనుభవించేవారు కనిపించారు. ఇతరులపై నిందలు వేసేవారు తమ రాగి గోళ్ళతో ముఖాలపై, ఎద రొమ్ములపై రక్కుకుంటు న్నారు. వడ్డీ తినేవారు, అనాథల సొమ్ము కాజేసే వారు, అవినీతి అక్రమాలకు పాల్పడేవారు, జూదం, మద్యం, వ్యభిచారం లాంటి దుర్మార్గాల్లో కూరుకుపోయిన వారు రకరకాల శిక్షలు అనుభవిస్తూ కనిపించారు. ఎవరైతే దైవాదేశాలకను గుణంగా ప్రవక్త వారు చూపిన బాటలో నడుచుకుంటూ, మంచి పనులు చేస్తారో అలాంటివాళ్ళే ఈ భయంకరమైన శిక్షల నుండి సురక్షితంగా ఉండగలుగుతారు. దైవం మనందరినీ తనకిష్టమైన మార్గంలో జీవితం గడిపే సద్బుద్ధిని ప్రసాదించి, భయంకరమైన శిక్షల నుండి కాపాడాలని వేడుకుందాం. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని ‘Geeturai Weekly’ పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com


‘చరితార్థులు’-2



# సకీనతుల్ ఫాతిమా

## (1886 -1957)

71





**మా భాష నేర్చుకోండి** అంటూ బ్రిటిష్ రాణి భారత ప్రతినిధి (వైస్రాయ్) ఇచ్చిన సలహాకు ప్రతిగా ఏ మాత్రం జంకు లేకుండా ‘మా భూమి మీద పాలన చేస్తున్న మీరు మా భాష నేర్చుకోండి...మీ భూమిని మేము ఏలుతున్నప్పుడు మీ భాషను మేము నేర్చుకుంటాం’ అంటూ టక్కున సమాధానమిచ్చి అందరిని ఆశ్చర్య పర్చిన సాహసి సకీనతుల్ ఫాతిమా. ఆమె మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో 1886లో జన్మించారు. చిన్ననాటి నుండి నిర్మొహమాటంగా, కరాఖండిగా మాట్లాడటం అలవాటుగా గల ఆమె ఆంగ్లేయ పాలకుల పట్ల వ్యతిరేక భావాలను సంతరించుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన జస్టిస్ సయ్యద్ వజీర్ హసన్ (1874-1947)ను వివాహమాడిన తరువాత ఆమె లక్నో వచ్చి స్థిరపడ్డారు. భర్త వజీర్ హసన్ ఆంగ్ల ప్రభుత్వంలో ఉన్నత స్థాయి న్యాయమూర్తి అయినప్పటికి సకీనతుల్ ఫాతిమా స్వేచ్ఛకు, ఆమె కార్యక్రమాలకు ఆయన ఎప్పుడూ అడ్డు రాలేదు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు ఆరంభమైన ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం సందర్భంగా ‘ఉద్యమ నిధి’ ఏర్పాటుకు జాతీయోద్యమ కారులకు సకీనతుల్ ఫాతిమా తోడ్పడ్డారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరవుతూ బ్రిటిష్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను తమ కార్యాచరణ ద్వారా వ్యక్తం చేశారు. 1931లో శాసనోల్లంఘన ఉద్యమానికి మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు సకీనతుల్ ఫాతిమా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జాతీయోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొనడానికి ఉత్సాహం చూపిన ఆమె తొలుత పరదా పరిధులను అధిగమించారు. అటు పుట్టినింటి నుండి ఇటు మెట్టినింటి నుండి ఆమెకు లభించిన అత్యంత విలువైన విదేశీ వస్త్రాలను, ఖరీదైన విదేశీ వస్తువులను లక్నోలోని హజరత్ గంజ్‌లో పోగువేసి బహిరంగంగా తగులబెట్టారు. మహాత్ముని మార్గాన చర్ఖాతో ఖద్దరు నూలు వడకటం ప్రారంభించి ఖద్దరు వస్త్రాలు ధరించి, ఖద్దరు ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ పతాకాన్ని తన వాహనానికి ఏర్పాటు చేసుకుని ఆంగ్లేయాధికారుల అభ్యంతరాలను లెక్కచేయక ప్రయాణాలు సాగించారు. మాతృభూమి స్వేచ్ఛ-స్వాతంత్ర్యాల కోసం మాత్రమే కాకుండా, ఆచార-సంప్రదాయ సంకెళ్ళలో బంధించబడి ఉన్న మహిళల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కూడా అభిలషించిన ఆమె ఆ దిశగా కూడా కృషి చేశారు. బహుభార్యత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. బాల్య వివాహాల నిరోధించడానికి 1929లో ప్రభుత్వం తెచ్చిన శారదా చట్టాన్ని, జమీందారి వ్యవస్థను రద్దు చేయడానికి 1948లో తెచ్చిన జమీందారి వ్యవస్థ రద్దు బిల్లును ఆమె సమర్థించారు. 1937 నుండి 1949 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం శాసన మండలి సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించిన సకీనతుల్ ఫాతిమా 1957 మే15న కన్నుమూసారు. ✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2** (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# ఖుర్ఆన్ పరిచయం

- సీమా సుల్తానా, గుంటూరు

**సర్వమానవాళి కోసం సృష్టికర్త తన చిట్ట చివరి ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా పంపబడిన "సందేశాల సమాహారం" ఖుర్ఆన్. 23 సంవత్సరాల కాలంలో అవతరించిన ఈ గ్రంథంలో, మనిషికి అవసరమైన ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక వ్యక్తిగత మార్గదర్శకత్వాలు ఉన్నాయి.**

మానవులను సృష్టించిన తరువాత సరైన జీవన మార్గం చూప వలసిన బాధ్యత ఆ సృష్టికర్తపై ఉంటుంది. కనుకనే దైవం ఇలా అంటున్నాడు. "వక్రములైన మార్గాలు కూడా ఉన్నప్పుడు, సక్రమమైన మార్గం చూపటం అల్లాహ్ బాధ్యతే" అని నహల్ అధ్యాయం 9వ వాక్యంలో ప్రస్తావిస్తున్నాడు. ఖురాన్ మానవ జాతి సంక్షేమానికి, సమాజ శ్రేయస్సుకు చక్కటి రుజుమార్గం చూపుతుంది.

సూరా ఇబ్రాహీం అధ్యాయం 1వ వాక్యంలో దైవం దైవప్రవక్తతో ఇలా అంటున్నాడు : "మేము దీనిని నీ వైపునకు అవతరింప జేశాము, నీవు ప్రజలను వారి ప్రభువు అనుమతితో చీకట్లలోనుండి వెలికితీసి వెలుగులోకి తీసుకురావాలని" అంటే వారి దైవం సర్వ శక్తిమంతుడు, సకల ప్రశంసలకు అర్హుడైన సృష్టికర్త మార్గంలోకి అని అర్థం. చీకటి- వెలుగు రెండు భిన్నమైనవి.

**చీకటి:-** అజ్ఞానం, భయం, నిరాశ, అస్పష్టతను సూచిస్తుంది.

**వెలుగు:-** జ్ఞానం, ఆశ, స్పష్టత, సానుకూల దృక్పథాన్ని చూపిస్తుంది.

ఖురాన్ వెలుగులో మనిషి జీవితానికి సంబంధించిన స్పష్టమైన నైతిక నియమాలు దిశానిర్దేశాలు ఉన్నాయి. మరోచోట ఈ విధంగా ప్రస్తావించడం జరిగింది.

"మేము భూమినీ, ఆకాశాలనూ వాటిలో ఉన్న సమస్తాన్నీ సత్యం పునాదిగా తప్ప, మరొకటి ఏది పునాదిగా సృష్టించలేదు" (అల్ హిజ్ర్: 85).

సత్యానికి వ్యతిరేకం అసత్యం, వీటి మధ్య తేడాను విభిన్న కోణాల ద్వారా స్పష్టంగా వివరిస్తుంది ఖుర్ఆన్.

సత్యవాక్కు, అసత్య వాక్కుల నుండి ప్రస్ఫుటం చేయబడింది. (సూరె బఖరా : 256).

సత్యం వచ్చేసింది, అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు. (బనీ ఇస్రాయిల్ :81).

కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి? (యూనుస్: 32వ వాక్యం)

సృష్టి పునాది సత్యానికి ప్రతీక, కనుక సత్యాన్ని అనుసరించటం ద్వారానే మనిషి శాశ్వత విజయాన్ని, దైవానుగ్రహాన్ని పొందవచ్చు.

**ఖురాన్‌లోని అంశాలను నాలుగు భాగాలుగా విభజించవచ్చు:**

1. దేవుని ఏకత్వం
2. సృష్టి నిర్మాణం

3. మనిషి జీవితానికి దిశానిర్దేశాలు

4. మరణానంతర జీవితం

**1. దేవుని ఏకత్వం:-** దైవం గుణగణాల గురించి ఇంకా ఆయన పవిత్రతను గురించి ఖుర్ ఆన్ స్పష్టంగా చెబుతుంది.

"ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు" (షూరా: 12).

"ఇలా చెప్పెయ్యి. ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు". (అల్ ఇఖ్లాస్).

"ఆయనకు ఒక జీవిత సహచరి అంటూ లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉంటాడు" (అల్ అన్ ఆమ్: 101)

ఆయనకు ఎలాంటి బలహీనతలు లేవు.

"అల్లాహ్- ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు, ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే" (అల్ బఖరా: 255)

"ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడు. ఆయనే ఆరంభమూ, ఆయనే అంతము; ఆయనే బాహ్యము, ఆయనే గూఢము. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు" (అల్ హదీద్: 3)

ఈ విశ్వంలోని అణువణువుకు ఆయన ఒక్కడే యజమాని. ఆయనకు పూర్తి విధేయులై విశ్వ వ్యవస్థలన్నీ నడుస్తున్నాయి. ఆయనకు ఎలాంటి బలహీనతలు లేవు.

**2. సృష్టి నిర్మాణంలో తన నైపుణ్యం గురించి దైవం తన గ్రంథంలో ఈ విధంగా తెలియజేస్తున్నాడు.**

"మీకు కనిపించే ఆధారాలు లేకుండా ఆకాశాలను నిలిపినవాడు అల్లాహ్‌యే." (అర్రాద్ :2)

"ఆయన సూర్యున్ని, చంద్రున్ని ఒక నియమానికి బద్ధులుగా చేశాడు." (అర్రాద్:2)

"ఆయనే ఈ భూమిని విశాలంగా పరచినవాడు. అందులో పర్వతాలను గుంజలవలె పాతినవాడు." (అర్రాద్ :3 )

"ఆయనే పగలును రాత్రిపై కప్పేవాడు" (అర్రాద్:3)

"అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. ప్రతి నది, ప్రతి కాలువ తన శక్తికొలది దానిని గ్రహించి బయలుదేరింది." (అర్రాద్ : 17)

ఇంకా మనిషి పుట్టుక గురించి ప్రస్తావిస్తూ దైవం ఇలా అంటున్నాడు.

"మాతృగర్భాలలో మీ రూపాలను తీర్చిదిద్దేది ఆయనే కదా!" (అలి ఇమ్రాన్ :5)

"రెండు సముద్రాలు ఒకదానితో ఒకటి కలిసిపోయేటందుకు ఆయన వాటిని వదిలిపెట్టాడు. అయినా వాటి మధ్య ఒక తెర అడ్డంగా ఉంది. అవి దానిని అతిక్రమించవు." (అర్ రహ్మాన్ : 19).

ఖురాన్ చదివితే మనకు సృష్టికర్త నైపుణ్యం, ఔన్నత్యం గురించి తెలుస్తుంది.

ఇక్కడ మనకు కనబడుతున్న భూమి, ఆకాశాలు, సూర్య చంద్రులు, జీవరాసులు, గ్రహాలు, నక్షత్రాలు, పర్వతాలు, నదులు, సముద్రాలు, మనిషి పుట్టుక, మనుషులకు మిగతా జీవారాసులకు ఆహారపు ఏర్పాటు ,ఇంకా భూమి మీద కొన్ని కోట్ల జీవరాశులను సృష్టించి, వాటి జీవన్మరణాలకు అమలు జరిగే ఈ సృష్టి వెనుక ఒక సర్వశక్తిమంతుడు, మహా వివేక వంతుడు ఉన్నాడని, ఆయన జ్ఞానం ప్రతి వస్తువుని, ప్రతి విషయాన్ని, పరివేష్టించి ఉందని, చెట్టు నుండి రాలే ఆకు కూడా ఆయన జ్ఞాన పరిధిలోనే ఉందని చెబుతోంది దివ్య ఖుర్‌ఆన్.

"భూమిపై ఉన్న వృక్షాలన్నీ కలములై సముద్రం (సిరా బుడ్డి అయి), దానికి ఇంకా ఏడు సముద్రాల సిరాను కలిపినా అప్పటికీ అల్లాహ్ మాటలు రాయటానికి పూర్తి కావు." (లుఖ్మాన్ : 27)

ఇలా ఒక్క మాటలో అతను ఎంతో అద్భుతమైన సృష్టికర్త అని అర్థమవుతుంది.

సృష్టికర్తను ఒక గొప్ప ఆర్కిటెక్ట్‌గా భావిస్తే, ఆయన సృష్టిలోని నైపుణ్యం, ప్రణాళిక, సమతుల్యం మనకు స్పష్టంగా అర్థమవుతాయి. ఆయన పని కేవలం సృష్టి నిర్మాణమే కాకుండా, సృష్టి నిర్వాహణను సమగ్రంగా నిర్వహిస్తున్నాడు.

**3. మనిషి జీవితానికి దిశా నిర్దేశాలు:-** సృష్టికర్త ఒక్కడే అని నమ్మి విశ్వసించటం, కేవలం ఆయన కోసమే ప్రార్థనా వ్యవస్థను స్థాపించటం, ఉపవాసాలు పాటించడం, జకాత్ రూపంలో పేద వారికి ఆర్థిక సహాయం చేయటం, స్తోమత ఉంటే కాబా గృహాన్ని సందర్శించటం. అంతేకాకుండా తల్లిదండ్రుల పట్ల మంచిగా

వ్యవహరించమని, బంధువుల పట్ల, ఇరుగుపొరుగు వారి పట్ల, మంచి సంబంధం కలిగి ఉండమని దైవం ఆజ్ఞాపిస్తున్నాడు.

వ్యక్తిగతంగా మనిషి అలవాట్ల గురించి చెబుతూ రక్తపాతం సృష్టించవద్దని, వ్యభిచారం దరిదాపులకు వెళ్ళ వద్దని, మద్యం, జూదం, వడ్డీ తినటం వంటివి చేయవద్దని, ఇలా చేస్తే మీ స్థాయిని దిగజార్చుకుంటారని తద్వారా సమాజానికి హాని కలిగిస్తారని హెచ్చరిస్తుంది ఖుర్ఆన్ .

ఒక్కమాటలో చెప్పాలంటే ఇహ లోకంలో మనిషి ఎలా జీవించాలో నేర్పడమే గాక, అతన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దు తుంది ఖుర్ఆన్. ఎంత గొప్పగా తీర్చిదిద్దుతుందంటే మన ప్రవక్త గారి లాగా, ప్రవక్త గారిని నడిచే ఖుర్ఆన్ అని హదీసు గ్రంథాల్లో చెప్పబడింది.

ఖుర్ఆన్ గొప్పతనం ఏమిటంటే, మనుషులకు నిజ దైవాన్ని గుర్తించేలా చేయటమే కాకుండా ఏ విధంగా "దైవాన్ని ప్రసన్నం" చేసుకోవాలో కూడా చాలా స్పష్టంగా తెలియజేస్తుంది.

**4. మరణాంతర జీవితం:-** ఈ ప్రపంచ జీవితం ఒక పరీక్షా సమయం. అల్లాహ్ ఇహలోకంలో మనుషులకు స్వేచ్ఛనిచ్చాడు, కానీ ఆ స్వేచ్ఛతో పాటు కర్మల బాధ్యత కూడా ఇచ్చాడు. ప్రతి వ్యక్తి తన మంచి, చెడు కర్మలకు జవాబుదారీగా ఉన్నాడు. "ప్రతి వ్యక్తీ తాను సంపాదించేదానికి తాకట్టుగా ఉంటాడు." (అల్ ముద్దస్సిర్ :38)

ఈ ప్రపంచ జీవితం ఒక పరీక్ష సమయం... ఒక విద్యార్థి పరీక్ష రాశాక, దానికి సంబంధించిన మార్కులు విద్యార్థి ప్రయత్నానికి ఏ విధంగానైతే సంకేతాలో, అదే విధంగా, ఈ జీవిత ఫలితం, మన కర్మల ఆధారంగా నిర్ణయించబడుతుంది. మంచీ చెడుల వివేకం.. సత్యం అసత్యాల మధ్య విచక్షణా జ్ఞానం కలిగి ఉండి ఇహలోకంలో మన ఆచరణ, ఖురాన్ హదీసులను బట్టి ఉంటే, మన మరణాంతర జీవితం కూడా చాలా గొప్పగా ఉంటుంది. దైవప్రవక్త ఇలా సెలవిచ్చారు: నేను మీ మధ్య రెండు వస్తువులను వదిలి వెళుతున్నాను ఒకటి ఖుర్ఆన్, రెండవది సున్నత్ (ప్రవక్త జీవిత విధానం)వీటిని అనుసరిస్తే మీరు సత్యమార్గం తప్పరు.

నేడు ఖుర్ఆన్ ప్రపంచంలోనే అత్యధికంగా చదివే గ్రంథంగా గుర్తించడం జరిగింది. ఇది మానవ రచన కాదని, దైవ జ్ఞానంతో అవతరించిన గ్రంథమని శాస్త్రీయంగా నిరూపితమైన కారణంగా పాశ్చాత్య దేశాల ప్రజలు ఎంతోమంది ముస్లింలుగా మారుతున్నారు. ఖుర్ఆన్ పఠనం చేసిన తర్వాత దాని లోతైన సందేశం, తత్వం, జీవన విధానానికి ఆకర్షితులవుతున్నారు. ఖుర్ఆన్‌లో పేర్కొన్న కొన్ని శాస్త్రీయ విషయాలు, ఇవి ఆధునిక శాస్త్రవేత్తల పరిశోధనల ద్వారా నిజమని నిరూపించబడ్డాయి. ఇలాంటి అద్భుతమైన గ్రంథం ద్వారా దైవం మనల్ని మార్గదర్శకత్వం వైపు నడిపించుగాక! అమీన్...

## బీసీ ఉద్యమానికి ముస్లిముల మద్దతు ఎప్పుడూ ఉంటుంది



పూణేలోని ఓ దళిత వాడలో మహాత్మా జ్యోతిబా పూలే దంపతులకు అమ్మాయిలకు చదువు చెప్పడం మానుకోవాలని లేదంటే ఇంటినుంచి వెళ్లిపోవాలని హెచ్చరికలు వచ్చాయి, ఇంటినుంచి వాళ్లను గెంటివేసిన తరుణంలో ఉస్మాన్ షేక్ అనే ముస్లిమ్ ఆ దంపతులిద్దరికీ తన ఇంటిలో స్కూలు ఏర్పాటుకు ఆశ్రయమిచ్చి పాఠశాల నిర్వహణకు అండగా నిలిచారని, ఉస్మాన్ షేక్ చెల్లెలు ఫాతిమా షేక్ అదే పాఠశాలలో మొదటి టీచర్‌గా పాఠాలు చెప్పారని జమాఅతె ఇస్లామీ హింద్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్ షుఐబ్ బీసీల ఉద్యమానికి ముస్లిములు ఎలా మద్దతు తెలిపారో వివరించారు. ఇటీవల హైదరాబాద్ సమీపంలోని ఘట్కేసర్ బీసీ భవన్‌లో జరిగిన బీసీ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ముస్లిములు బీసీ ఉద్యమానికి ఎప్పుడూ అండగా నిలిచారని గుర్తుచేశారు. జ్యోతిబా పూలేకు భారత రత్న ఇవ్వాలన్న తీర్మానానికి మద్దతు తెలిపారు. బీసీ ఉద్యమంలో ముస్లిమ్ మహిళల పాత్ర ఉందని గుర్తుచేశారు. ప్రతీ సోషల్ రీఫార్మ్‌లో ముస్లిములు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. తీన్మార్ మల్లన్న గారు ప్రారంభించిన బీసీ ఉద్యమానికి జమాఅతె ఇస్లామీహింద్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. పంచాయితీ ఎన్నికల సందర్భంగా తీన్మార్ మల్లన్న టీమ్‌కు పూర్తి మద్దతు ఇస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో జమాఅతె ఇస్లామీహింద్ కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం చేసే ప్రతీ ఉద్యమంలో తమ పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఆనాడు బెంగాల్ నుంచి బీఆర్ అంబేద్కర్‌ను గెలిపించి పార్లమెంటుకు పంపిన ఘనత ముస్లిమ్ లీగ్‌కు సొంతమన్నారు. ముస్లిములు ముందునుంచీ దళితులకు అండగా నిలిచారని గుర్తు చేశారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు మక్కా అవతరణ

# 45. అల్ జాసియ

## ప్రవేశిక

**పేరు:** 28వ ఆయత్‌లోని వాక్యం నుండి గ్రహించబడింది. జాసియ అనే పదం వచ్చిన సూరా అని భావం.

**అవతరణ కాలం:** ఈ సూరా అవతరణ కాలం కూడా విశ్వసనీయమయిన ఏ ఉల్లేఖనం ద్వారానూ తెలిసి రాలేదు. కాని దీని విషయాల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది, ఇది అద్ దుఖాన్ సూరా తరువాతనే సమీపకాలంలో అవతరించిందని. రెండు సూరాల విషయాలలో దగ్గరి పోలిక ఉంది, దీనివల్ల ఈ రెండున్నూ కవలలుగా కానవస్తాయి.

**ప్రధాన విషయం, చర్చనీయాంశం:** దీని ప్రధాన విషయం, తౌహీద్ (దేవుని ఏకత్వం), ఆఖిరత్ (పరలోకం)లను గురించి మక్కా తిరస్కారుల అనుమానాలకు, ఆక్షేపణలకు సమాధానం ఇవ్వడం, వారు ఖుర్‌ఆన్ సందేశానికి ప్రతిగా అవలంబిస్తున్న వైఖరి పట్ల వారిని హెచ్చరించడం.

తౌహీద్‌కు ఆధారాలు చూపడంతో వచనం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంలో మానవుని వ్యక్తిత్వం మొదలుకుని భూమీ ఆకాశాల వరకు వ్యాపించి ఉన్న అసంఖ్యాకమయిన సూచనలను సంకేతంగా తెలిపి, మీరు ఎటు తలెత్తి చూసినా, ప్రతి వస్తువూ దేవుని ఏకత్వానికే సాక్ష్యంగా నిలుస్తోందని, మీరేమో దాన్నే నమ్మడానికి నిరాకరిస్తున్నారని తెలుపడం జరిగింది. ఈ విభిన్నమయిన జంతురాశులు, ఈ రేయింబవళ్ళు, ఈ వర్షాలు, వీటివల్ల పుట్టుకువచ్చే వృక్షరాశులు, ఈ గాలులు, ఈ మానవ పుట్టుక ఈ సమస్త విషయాలను ఎవరయినా కళ్ళు తెరచి చూసినట్లయితే, ఎటువంటి విద్వేషం, దురభిమానాలకు తావివ్వక తన బుద్ధిని సక్రమమయిన రీతిలో వినియోగించి వీటిని గురించి యోచిస్తే ఈ సూచనలు ఈ విశ్వ వ్యవస్థ దైవం లేకుండానే లేదని, లేదా అనేక దైవాల దైవత్వం ఆధ్వర్యాన కూడా నడవటం లేదని, వాస్తవంగా ఒకే దైవం దీన్ని నిర్మించాడు, కేవలం ఆయన ఒక్కడే దీని నిర్వాహకుడు, పరిపాలకుడు కూడా అనే విషయాన్ని నమ్మకం కలిగించడానికి ఎంతయినా సరిపోతాయి. అయితే అసలు నమ్మనే కూడదని ప్రమాణం చేసుకుని కూర్చున్న వ్యక్తి, లేదా అనుమానాలు, కుశంకలలోనే పడి ఉండాలని నిర్ణయించుకున్న వ్యక్తి విషయం పూర్తిగా వేరయినది. అతనికి ప్రపంచంలో ఎటు నుండి కూడా నమ్మకం, విశ్వాసాల సంపద ప్రాప్తమే కాజాలదు.

ఇంకా ముందుకు సాగిన తరువాత రెండవ రుకూ ప్రారంభంలో ఇలా తెలుపడం జరిగింది: మనిషి ప్రపంచంలో ఎన్ని పదార్థాలను వినియోగించుకుంటున్నాడో, ఏ ఏ అసంఖ్యాకమయిన అపరిమితమయిన పదార్థాలు, శక్తులు ఈ విశ్వంలో అతని ప్రయోజనార్థం సేవలు అందజేస్తున్నాయో అవన్నీ వాటంతట అవే, ఎక్కడి నుండో వచ్చిపడలేదు. ఏ దేవీదేవతలు వాటిని సమకూర్చనూ లేదు. నిజానికి ఆ ఒక్క దైవమే అసలు ఇవన్నీ తన వద్ద నుండి ఇతనికి అనుగ్రహించాడు, ఇతనికి వీటిని అధీనపరిచాడు. ఎవరయినాసరే సరయిన ఆలోచన, చింతనలతో పరిశీలిస్తే స్వయంగా అతని బుద్ధి ఎలుగెత్తి పలుకుతుంది, ఆ దైవమే మానవుని మహోపకారి, మానవుడు కృతజ్ఞుడయి మెలిగేందుకు అన్ని విధాలా ఆయనే అర్హత గలవాడు అని.

ఆ తరువాత మక్కా తిరస్కారులు అనుసరించే మంకుపట్టు, అహంకారం, ఎగతాళి, తిరస్కారం పట్ల వారిని తీవ్రంగా అధిక్షేపించడం జరిగింది. ఈ నీచతత్వాల ద్వారానే వారు ఖుర్‌ఆన్ సందేశాన్ని ఎదిరిస్తున్నారు. వారిని హెచ్చరించి ఇలా తెలుపడం జరిగింది: ఈ ఖుర్‌ఆన్, పూర్వం బనీ ఇస్రాయీల్‌కు అందజేయబడిన వరప్రసాదాన్నే తీసుకు వచ్చిందని. దాని మూలంగానే వారు ప్రపంచ జాతులన్నింటిపైనా ఘనతకు అర్హులయ్యారు; వారు ఈ వరప్రసాదానికి విలువనివ్వక, ధర్మంలో విభేదాలకు పాల్పడి దాన్ని పూర్తిగా కోల్పోయారు. ఇక ఇప్పుడు అదే వరప్రసాదాన్ని మీ వద్దకు పంపడం జరిగింది. ఇదొక మార్గ దర్శకం. ఇది స్పష్టమయిన ధర్మమార్గాన్ని మానవునికి చూపెడుతుంది.

(మిగతా వచ్చే సంచికలో)

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### సిసలైన పశ్చాత్తాపం

**173)** ఉర్వా బిన్ జుబైర్ తనకు ఈ విధంగా తెలియజేశారని జుహ్రీ చెప్పారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) కాలంలో– మక్కా విజయం సందర్భంగా– ఒక స్త్రీ (ఒక ఆభరణాన్ని) దొంగిలించింది. ఉర్వా ఇలా అన్నారు: ఉసామా బిన్ జైద్(రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఆమె కొరకు సిఫారసు చేసినప్పుడు ప్రవక్త ముఖారవిందం రంగు మారిపోయింది. "అల్లాహ్ విధించిన ఒకానొక హద్దు (శిక్ష) విషయంలో నీవు సిఫారసు చేయడానికి నా దగ్గరకు వచ్చావా?"అని ఆగ్రహం వెలిబుచ్చారాయన(స). 'యా రసూలల్లాహ్! నా క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించండి' అని ఉసామా విన్నవించుకున్నారు.

మరి మధ్యాహ్నం తర్వాత దైవప్రవక్త(స) తన సహచరమాన్యులనుద్దేశించి ప్రసంగించారు. అల్లాహ్‌ను ఆయన ఘనతకు తగ్గ రీతిలో స్తుతించిన తరువాత ఇలా అన్నారు: "అమ్మాబాద్! మీ పూర్వీకులు నాశనమవడానికి కారణమేమిటంటే, ఒకవేళ వారిలోని ఉన్నత వంశీయుడు, గౌరవనీయుడు ఎవరయినా దొంగతనం చేస్తే వారు అతనిని విడిచి పెట్టేసేవారు. ఒకవేళ ఎవరయినా ఒక బలహీనుడు గనక దొంగతనం చేస్తే అతనికి శిక్ష విధించేవారు. వినండి! ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! ఒకవేళ ముహమ్మద్ పుత్రిక ఫాతిమా దొంగతనం చేసినా, నేను ఆమె చేతిని నరకడానికి వెనుకాడను".

ఆ తరువాత దైవప్రవక్త(స) ఆదేశాన్ననుసరించి ఆ స్త్రీ చేయి నరకబడింది. పిదప ఆ స్త్రీ నిష్కల్మషమైన హృదయంతో పశ్చాత్తాపపడింది. వివాహం కూడా చేసుకుంది. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: "తరువాత ఆమె తరచూ నా దగ్గరకు వస్తూ ఉండేది. ఆమెకు ఏదయినా అవసరం ఉంటే నేను దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించేదానిని."

### పవిత్ర నగరిలో

**179)** ముజాహిద్ కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా విజయం నాడు ప్రసంగించడానికి నిలబడి ఇలా అన్నారు: "అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాడే మక్కాను పవిత్ర నగరిగా ఖరారు చేశాడు. కనుక ఈ నగరం అల్లాహ్ ఆజ్ఞానుసారం ప్రళయదినం వరకూ పవిత్ర నగరంగానే ఉంటుంది. నాకు పూర్వం కూడా ఇది ఎన్నడూ ఎవరి కొరకు కూడా (నిషేధాజ్ఞల ఉల్లంఘనకై) ధర్మ సమ్మతం గావించబడలేదు. నా తర్వాత కూడా ఎవరి కొరకు కూడా ధర్మసమ్మతం (హలాల్) కాజాలదు. నా కోసమైనా కేవలం ఒక గడియ కాలం కొరకు మాత్రమే హలాల్ గావించబడింది. ఇక్కడ– పుణ్యక్షేత్ర పరిధిలో– వేటాడదగిన జంతువుల జోలికి పోకూడదు. ముళ్ళ వృక్షాలను నరకరాదు. ఇక్కడి గడ్డిని కూడా పెకలించకూడదు. ఇక్కడ క్రింద పడివున్న వస్తువుల్ని కూడా ఎత్తుకోరాదు – ప్రకటన చేసే ఉద్దేశం ఉన్నవారు మాత్రమే ఆ వస్తువులను ఎత్తుకోవాలి". అప్పుడు అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి), 'దైవప్రవక్తా! ఇజ్‌ఖిర్ గడ్డి విషయంలో అనుమతిని ప్రదానం చేయండి. ఎందుకంటే ఆ గడ్డి కంసాలులకు, ఇండ్ల నిర్మాణానికి ఉపయోగపడుతుంది' అని విన్నవించుకోగా, "సరే, ఇజ్‌ఖిర్ గడ్డికి ఈ ఆజ్ఞ వర్తించదు" అని దైవప్రవక్త(స) చెప్పారు.

వేరొక ఉల్లేఖనంలో ఇబ్నె జురైజ్ ద్వారా కూడా ఇలాగే ఉటంకించబడింది. ఆయన అబ్దుల్ కరీమ్ బిన్ మాలిక్ నుండి, మరాయనేమో ఇబ్నె అబ్బాస్ (రజి), అబూ హురైరా(రజి)ల నుండి సంగ్రహించిన దాని ప్రకారం కూడా ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలాగే ఉపన్యసించినట్లు ఉంది.

4

# ఇస్లామీయ ఉద్యమం- దాని క్రమవికాసం

- ఎస్.ఎమ్. మలిక్

**ఉద్యమంలో చేరుతున్న నవతరానికి ప్రత్యేకం**

### జీవన వ్యవస్థ ఆచరణ రూపంలో...

ఇస్లామ్ ఒక పరిపూర్ణ జీవన వ్యవస్థ. అది మానవుని ప్రాపంచిక సమస్యలన్నింటికీ ఓ సమగ్ర పరిష్కారం కావటాన, కేవలం సూత్రప్రాయమయిన, సైద్ధాంతికమయిన మార్గదర్శకత్వాన్నేగాక, ఆచరణాత్మక కృషి చెయ్యడం అనివార్యం. అప్పుడే సమస్యల పరిష్కారం బోధపడుతుంది. అందువల్లనే ఉద్యమం దాని కార్యక్రమంలో ఇటువంటి అనేక సమస్యల్ని పేర్కొన్నది, ఇంకా అనేక సమస్యల విషయంలో ఆచరణాత్మకంగా కృషి జరపడమూ ప్రారంభించింది. ప్రస్తుత కాలంలో ప్రపంచమంతా ముడుచుకుని ఓ భూలోక గ్రామం (*Global Village*)గా రూపం దాల్చింది. నేడు ఓ భూభాగంలో ఏమయినా సంభవిస్తే అది ప్రపంచంలోని ఇతర భూభాగాల్లో క్షణాల్లో మార్మోగకపోవడం అసంభవం కాదు! అలాగే ఓ మూలలో ఏదయినా జరిగితే, మరో మూలన ఆ పరివర్తనల ప్రభావం పడకపోవడమూ అసంభవం కాదు. అందువల్ల ఇస్లామీయ ఉద్యమం అంతర్జాతీయ స్థాయిలో సంభవించే పరివర్తనలను గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం. ఇంకా అది స్వయంగానూ, ఇంకా సోదర దేశవాసులను, పాలక వర్గాలను, ప్రభుత్వ సంస్థలనూ, వాటి పట్ల దృష్టి మళ్ళిస్తూ, తన అభిప్రాయాన్నీ ప్రస్ఫుటపరుస్తూ ఉండటం అవసరం. అలా పరిస్థితులపైన వీలయినంతవరకు ప్రభావం వేసే ప్రయత్నం చెయ్యడమూ అవసరమే.

### కారుణ్య స్వరూపులు

ఇస్లామీయ ఉద్యమం ఓ దైవ కారుణ్య వ్యవస్థ వైపునకు పిలుపునిస్తుంది. దాని ప్రభావం రూపంలో, ఉద్యమ కార్యకర్తలు తమ శక్తి మేర, తమ సామర్థ్యం మేర ఆహ్వానితుల పట్ల నిండుగా, పరిపూర్ణంగా మూర్తీభవించిన కారుణ్య స్వరూపులుగా మారిపోవాలి. ఈ ఉద్యమం, ఏ కారుణ్య మూర్తి ప్రవక్త(స) సందేశాన్ని ప్రపంచంలోని సకల రుగ్మతలకు నివారిణిగా అందజేస్తున్నదో, దాని పునీత ఛాయలు ఉద్యమ కార్యకర్తల శీల స్వభావాలపైన పడటం, అది వారి వైయక్తిక, సామాజిక ఆచరణల్లో ప్రస్ఫుటమవడం అవసరం. ఇస్లామీయ ఉద్యమం దాని ప్రారంభ దశ నుండే మానవ సేవను తన లక్షణంగా చేసుకుంది. దాని వద్దనున్న మానవ వనరుల్ని, ధన సామగ్రిని వినియోగించి వాటికనుగుణంగా మానవుల బాధల్ని పీడల్ని నివారించడానికి అది శాయశక్తులా కృషి చేస్తోంది. ఆకలి దప్పులు, వ్యాధుల ఇబ్బందులు, రుణాలు, నిరుద్యోగం, ప్రకృతి వైపరీత్యాలు తదితర కష్టాల్లో, ఆపదల్లో

జనుల్ని ఆదుకునేందుకు అవసరమయిన ఏర్పాట్లు చేస్తోంది. దీనిగ్గాను, వీలయినన్ని చోట్ల జనసేవా సంస్థలు స్థాపిస్తోంది, ఆ సంస్థల్ని దేశ చట్టాలకు అనురీతిలో సంస్థాగతంగా చట్టబద్ధం చేసేందుకు సాధ్యమయిన రూపంలో కృషి చేస్తోంది.

ఈ కార్యకలాపాలను ఉద్యమం కేవలం ఓ పాలసీగా కాకుండా- ఇస్లామ్ ఓ కారుణ్య ధర్మం కావటాన- దాని విధి రూపంలో నిర్వర్తిస్తోంది. అన్ని స్థాయిల్లోని కార్యకర్తలు ఈ స్ఫూర్తి, స్ఫురణతోనే ఈ విధిని నిర్వర్తించాలని ఆశిస్తోంది. అదే శిక్షణ కూడా గరుపుతూ ఉంటుంది. అయితే సహజంగానే ఉద్యమ ఉద్దేశ్యం, లక్ష్యాల రీత్యా ఈ కార్యకలాపాలన్నీ విభిన్న దశల్లో జరుగుతూ ఉంటాయి. ఏ విధమయిన, ఏ శక్తి సామర్థ్యాలున్న కార్యకర్తలు దానికి లభిస్తూ ఉంటారో అదే క్రమంలో, అదే స్థాయిలో ఉద్యమ కార్యక్రమాలు కొనసాగుతూ ఉంటాయి.

## కార్యకర్తల శీల స్వభావాలు

ఉద్యమం విజయవంతంగా దాని సకల కార్యరంగాలలో, సకల దశలలో పురోగమిస్తూ ఉండాలంటే, మొదటి షరతు ఏమిటంటే దాని కార్యకర్తలు, తాము ఏ సందేశానికి ధ్వజవాహకులో దానికి స్వయంగా వారే ఆదర్శవంతులుగా, మూర్తీభవించిన ఆచరణా స్వరూపులుగా రూపొందాలి. ఇస్లామ్ దాని అనుయాయుల్ని ఏ ఆలోచనా విధానానికి, ఏ నైజానికి, ఏ శీల స్వభావాలకు ఆయువుపట్టుగా మారాలని అభిలషిస్తుందో దానికి వారు సజీవమైన నమూనాగా, ఆదర్శంగా రూపొందాలి. ఉద్యమ కార్యకలాపాలన్నీ కొనసాగుతూ ఉండగా, ఉద్యమ కార్యకర్తలు తమ నైతిక నడవడి రీత్యా, శీల స్వభావాల రీత్యా, తోటి మానవుల ఎడల తమ వ్యవహరణ రీత్యా, తమ వ్యక్తిగత, సామూహిక వ్యవహారాల దృష్ట్యా తాము ఏ ఇస్లామ్ సందేశానికి పిలుపునిస్తున్నామో దానికి ప్రతిరూపాలయి నిలువకపోతే వారు ఏ ముఖంతో ఇతరుల్ని దాని వైపునకు పిలుపునివ్వగలుగుతారు? ఏ విధంగా ఆ ధర్మాన్ని ఇతరులపైన నెలకొలుపగలుగుతారు?? అందువల్ల ఉద్యమం దాని కార్యకర్తలకు వారు తమ శీల స్వభావాలను చక్కబరచుకోవడం, వారి ప్రప్రథమ, ప్రముఖ శ్రద్ధకు కేంద్రంగా, ప్రధాన మూలంగా నిర్ణయించింది. ఆ తరువాతనే ఇతర కార్యకలాపాల ప్రాధాన్యత. ఉద్యమం సదా దాని కార్యకర్తల సుశిక్షణ, సువ్యవస్థ, సంస్థాగతంగా పటిష్టత పట్ల శ్రద్ధ వహిస్తూ వారి కలయిక వల్ల ఏర్పడ్డ సామూహిక వ్యవస్థ ఆదర్శప్రాయమయిన ఇస్లామీయ సంఘటనగా రూపొందాలని కోరుకుంటుంది.

## విభిన్న రంగాలు...

ఉద్యమ కార్యకర్తల సుశిక్షణ మొదలుగా, దేశ, అంతర్జాతీయ వ్యవహారాలపైన ప్రభావం వేయడంవరకు, ఉద్యమ కార్యకర్త మొదలుగా, స్థానిక యూనిట్, జాతీయ స్థాయి సంస్థ వరకు ఎన్నో విధాల కార్యకలాపాలున్నాయి. ఉద్యమం వాటినన్నింటినీ సజావుగా నిర్వర్తించాలనే ఆశిస్తుంది; ఇది వాస్తవం. ఇస్లామీయ ఉద్యమం దాని స్వభావం రీత్యా ఓ సైద్ధాంతిక, ఆలోచనా ప్రధానమయిన, భావాత్మకమయిన ఉద్యమం. అంటే కేవలం సిద్ధాంతాలను, భావాలను, ఆలోచనల్ని మటుకు వ్యాపింపజేయడం వరకే దాని కార్యకలాపాలు పరిమితమయినవని అర్థం కాదు. అది ఆ ఆలోచనలు, సిద్ధాంతాల ప్రకారం ఆచరణాత్మకంగా ఓ సమాజాన్ని నిర్మించడం కూడా దాని బాధ్యతే. ఇంకా దేశంలో నెలకొన్న రాజకీయ వ్యవస్థను సయితం దాని సిద్ధాంతాలకు, ఆలోచనా వ్యవస్థకు అనురూపంలో మలచడానికి ప్రయత్నం చెయ్యడం కూడా దాని కర్తవ్యమే! తదనుగుణంగా పైన పేర్కొన్న కార్యకలాపాలలో దేన్ని కూడా ఉద్యమం సకల జీవన రంగాలలో ప్రవేశించడానికి, దాని విస్తృతికి అనవసరమయినదని వాదించడానికి వీల్లేదు. ఇవన్నీ దాని సందేశానికి ఆచరణ రూపాలే, ఆ కార్యకలాపాలన్నీ దాని సందేశానికి ఆచరణాత్మకమయిన ప్రతిరూపాలే!

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




# మస్జిదులు మానవతా కేంద్రాలు

**ఇప్పుడు** రాజకీయాలన్నీ మస్జిదుల చుట్టూనే తిరుగుతున్నాయి. హిందుత్వ వాదులు మస్జిదుల త్రవ్వకాలు చేపట్టాలని పెద్ద ఉద్యమమే లేవనెత్తుతున్నారు. బాబ్రీ మస్జిదు కూల్చివేత తరువాత రామమందిర నిర్మాణంతో మస్జిదు వివాదం సద్దుమణుగుతుం దంటే మరిన్ని మస్జిదులు త్రవ్వకాలు చేపట్టాలని రోజుకో డిమాండు వస్తోంది. జ్ఞానవాపి మస్జిదు సర్వే, కోర్టుల దాకా వెళ్లి అక్కడ పూజలూ ప్రారంభించారు. అజ్మీర్ లో, సంభల్ జామియా మస్జిదులో త్రవ్వకాలు చేపట్టాలనే డిమాండ్లు, కోర్టుమెట్లెక్కడాలు చకచకా జరిగిపోయాయి. దేశంలో 40వేల మస్జిదులను మంది రాలు కూల్చి కట్టారని, ఆ మస్జిదులన్నింటినీ కూలగొట్టాలనే డిమాండ్లు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికపై విషం కక్కు తున్నారు. టీవీ డిబేట్లు, న్యూస్ స్టోరీలు ఇలా వరుస పెట్టి విద్వేష ప్రసారాలు జరుగుతున్నాయి. మస్జిదుల సర్వే చేయాలనే డిమాండ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మస్జిదు కట్టడాల క్రింద మందిరాలు వెతికే పనిలో తలమునకలై ఉన్నారు. చివరాఖరుకు సుప్రీంకోర్టు కలగ జేసుకుని 1991 ప్రార్థనా స్థలాల చట్టానికను గుణంగా ఎలాంటి వినతులు తీసుకోవద్దని కింది కోర్టులకు ఆదేశించింది. ఎలాంటి సర్వేలకూ అనుమతించవద్దని కోర్టు తేల్చి చెప్పింది. ఆయా మస్జిదుల్లో ఉన్న యధాతథ స్థితిని కొనసాగిం చాలని కోర్టు పేర్కొంది. మస్జిదులపై లేనిపోని అపోహలు, అపార్థాలు, అనుమానాలు రేకెత్తించడంలో హిందుత్వ వాదులు సఫలమయ్యారనే చెప్పవచ్చు. మదర్సాలు ఉగ్రవాద కేంద్రాలని, హిందువులకు వ్యతిరేకంగా విద్వేషం చిమ్మే నిలయాలనే ప్రాపగాండ చేస్తున్నారు. కోవిడ్ -19 వ్యాప్తిలోనూ తబ్లీగీ జమాఅత్ పాత్ర ఉందనే ప్రచారం అప్పట్లో ఎలా జరిగిందో దేశమంతా చూసింది. మస్జిదు నుంచి వచ్చే అజాన్ శబ్దం వల్ల తమకు తీవ్ర ఇబ్బంది, అసౌకర్యం కలుగుతుందనే అభ్యంతరాలు వస్తున్నాయి. కోర్టు ఆదేశాలున్నప్పటికీ ఢిల్లీలో ఎన్నో మస్జిదులను నేలమట్టం చేశారు. మస్జిదులపై వస్తున్న విద్వేష ప్రచారాన్ని ముస్లిములు తిప్పికొట్టాలి. దేశ ప్రజల ముందు మస్జిదు పరిచయం చేయాల్సిన

బాధ్యత ముస్లిములపైనే ఉంది. చరిత్రలో మస్జిదులు ఎలాంటి పాత్ర పోషించాయో ముందు ముస్లిములు తెలుసుకోవాలి. ఇస్లామోఫోబియా ప్రచారంలో మస్జిదులను ఎలా టార్గెట్ చేస్తున్నారో ముస్లిములు తెలుసుకోవాలి.

మస్జిద్ అంటే కేవలం నమాజు చేసే ప్రదేశం మాత్రమే కాదన్న విషయం ముస్లిములు తెలుసుకోవాలి. అన్ని మతాల వారికి సేవా కేంద్రం అన్న విషయం చాలా మందికి తెలియదు. పూర్వం మస్జిదులు ప్రజా సేవ కేంద్రాలుగా ఎంతో కీలకపాత్ర పోషించాయన్న విషయం మరుగునపడింది. ఈ దేశంలో మూడు లక్షలకు పైగా మస్జిదులున్నాయన్నది ఒక అంచనా. ఈ మస్జిదులు దేవుని ఏకత్వం, మానవ సోదరభావాన్ని చాటిచెబుతున్నాయి. ప్రతీ మస్జిద్ నిర్మాణం వెనుక ఒక కథ తప్పకుండా ఉంటుంది. ఈ మస్జిదులు సెంటర్స్ ఆఫ్ పీస్ అండ్ సెక్యూరిటీ. శాంతి, భద్రతలకు, సామరస్యాలకు నిలయాలు. దేశ విభజన సమయంలో జరిగిన అల్లర్లలో ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. వేలాది మంది రిఫ్యూజీలకు ఈ మస్జిదులే ఆశ్రయం కల్పించాయి. మత కలహాల సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు మస్జిదు తలుపులు తెరుచుకున్నాయి. ఇప్పటికీ మస్జిదులు శాంతి, భద్రతలకు నిలయాలుగా నిలుస్తున్నాయి. గుజరాత్ అల్లర్ల సమయంలోనూ మస్జిదులో తలదాచుకుని ఎంతోమంది ప్రాణాలు కాపాడుకున్నారు. అహ్మదాబాద్‌లోని నూరాని మస్జిదులో అప్పటి ఏఎస్ఐ వాఘేలా ఎంతోమందికి ఆశ్రయం కల్పించారు. మస్జిదు పరిసరాల పట్ల ఆయన ఎంతో ఆకర్షితులయ్యారు. మస్జిదులో ఉన్న ప్రశాంత వాతావరణానికి నా సెల్యూట్ అని చెబుతారు వాఘేలా. మస్జిదులు కేవలం ఆశ్రయం కోసమే కాకుండా వైద్య, ఆరోగ్య కేంద్రాలుగానూ, ఆకలి తీర్చే, పునరావాస, విద్య కేంద్రాలుగా తగిన పాత్ర పోషించాయి. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతీసారి మస్జిదులు ఆశ్రయమిచ్చాయి. తమిళనాడులో 2023 డిసెంబరులో వరదలు వచ్చినప్పుడు ఎన్నో హిందూ కుటుంబాలు మస్జిదులో ఆశ్రయం పొందారు. ప్రపంచ వ్యాప్తంగా మస్జిదుల పాత్ర విశ్వజనీనమైనదే. మస్జిదులపై ఎంతోమంది ముస్లిమేతరులు అధ్యయనాలు చేశారు. 'రోల్ ఆఫ్ మాస్క్స్ ఇన్ ఎర్త్ క్వేక్స్ ఇన్ జపాన్'' భూ కంపాలు సంభవించినప్పుడు మస్జిదులు పోషించిన పాత్ర గురించి ఆ ఆ అధ్యయనం చాలా గొప్పగా వివరించింది. మస్జిదులు మతసామరస్య కేంద్రాలని తెలుస్తుంది. ఇప్పటికీ మస్జిదులు మతసామరస్య కేంద్రాలుగానే నిలుస్తున్నాయనే ఉదాహరణలు మనదేశంలో ఎన్నో ఉన్నాయి. విద్వేషాగ్ని ఎంత వేగంగా అంటుకుంటుందో అంతే వేగంగా మత సామరస్యమూ విస్తరిస్తుంది. పంజాబ్‌లోని కులంద్‌పూర్ గ్రామంలో ముస్లిముల కోసం అక్కడి సిక్కు కుటుంబాలన్నీ కలిసి మస్జిదును నిర్మించాయి. కేరళలోనూ ఓ ఉదాహరణ గొప్పగా చెప్పుకోవచ్చు. కేరళలోని గోవిందన్ గోపాలకృష్ణన్ ను మాస్క్ మ్యాన్ ఆఫ్ కేరళగా పిలుచుకుంటారు. ఈయన ఎన్నో మస్జిదులు నిర్మించారు. చరిత్రను అధ్యయనం చేసినా ఇలాంటి ఎన్నో ఉదాహరణలు మనకు కనపడతాయి. ఎన్నో మస్జిదులను హిందువులు నిర్మించిన ఘటనలు కోకొల్లలు కనపడతాయి. 1264లో గుజరాత్ లో పలు ప్రాంతాల నుంచి వ్యాపారుల బృందాలు వస్తుంటాయి. అక్కడ నిర్మించిన ఒక మస్జిదు లీగల్ డాక్యుమెంట్లు అరబీ, సంస్కృతంలో ఉన్నాయి. ఆ డాక్యుమెంట్లపై స్థానిక ప్రభుత్వ అధికారుల సంతకాలతోపాటు పూజారుల సంతకాలున్నాయి. అంటే మస్జిదు నిర్మాణం అన్ని మతాల వారు కలిసి నిర్మించారన్న విషయం తెలుస్తుంది. ఇప్పటికీ దేశంలోని చాలా ప్రాంతాల్లో మస్జిదులు హిందువుల సహకారంతో నిర్మించబడుతున్నాయి. మస్జిదులు మానవతా కేంద్రాలుగా సేవలందిస్తున్నాయి. కోవిడ్-19 విపత్తు వేళ తమ తమ ప్రాంతాలకు కాలినడకన వెళ్లే వారికి మస్జిదులు ఆశ్రయమిచ్చాయి. ఆకలి తీర్చాయి. మస్జిదుల్లో ఆక్సిజన్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రాణాలు నిలిపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మస్జిదులు కోవిడ్ కేర్ సెంటర్లుగా అవతరించాయి. వ్యాక్సినేషన్ సెంటర్లుగా పని చేశాయి. ఈ మస్జిదుల్లో కులమతాలకతీతంగా సేవలు పొందారు. కమ్యూనిటీ కిచెన్ అవతారమెత్తాయి. హ్యూమానిటేరియన్ సెంటర్లుగా ఆదుకున్నాయి. కర్ణాటకలోని హ్యూమానిటేరియన్ రిలీఫ్ సంస్థ మస్జిదు కేంద్రంగా రెండు లక్షల డాలర్ల ఆహారాన్ని పంపిణీ చేశారు. గత రెండు దశాబ్దాలుగా, హైదరాబాద్‌కు చెందిన హిందూ కాలిగ్రాఫర్ అనిల్ కుమార్ చౌహాన్, మసీదుల గోడలపై ఖురాన్ వాక్యాలను క్యాలీగ్రఫీ ఆర్ట్‌తో అందంగా రాస్తున్నారు. చౌహాన్ హైదరాబాద్‌లోని ఎన్నో మస్జిదుల గోడలను తమ క్యాలీగ్రఫీ కళతో చిత్రించాడు. జామియా నిజామియా మదర్సా లైబ్రరీలో సూరా యాసీన్ అందరినీ ఆకట్టుకుంటుంది. "హిందువులు, ముస్లింలు శాంతియుతంగా జీవించాలి. ఖురాన్ వాక్యాలను చిత్రించడం చాలా గర్వంగా ఉంది."అంటారు చౌహాన్.

మస్జిదుల ముందు ఎంతోమంది కులమతాల కతీతంగా తల్లులు తమ పిల్లల ఆరోగ్యం కోసం వేచిచూస్తారు. మస్జిదు ఇమామ్ ఆశీర్వచనాలతో తమ పిల్లలకు స్వస్థత చేకూరుతుందన్నది వాళ్ల నమ్మకం. మస్జిదులు విద్వేషాన్ని కాదు ప్రేమ సందేశాలను అందించాయి. లౌడ్ స్పీకర్ల నుంచి వచ్చేది ప్రేమ సందేశమే! ❖




**(గత సంచిక తరువాయి)**

మనిషిని శాశ్వత అస్తిత్వంగా దేవుడు సృష్టించాడు. మరణానంతరం మనిషి శరీరం చెడిపోతుంది. కానీ ఆత్మ సురక్షితంగా ఉంటుంది. మరణానంతర జీవితం శాశ్వత జీవితం. మరణానికి ముందు జీవితం పరీక్ష కోసం నిర్దేశించబడిన తాత్కాలిక జీవితం. ఈ ప్రాపంచిక జీవితంలో మనిషి ఆయుష్షు పరిమితమైనది కానీ అతని కోరికలు అపరిమితమైనవి. ఏ మనిషి కూడా మరణాన్ని, వృద్ధాప్యాన్ని, బలహీనతను, రోగగ్రస్త జీవితాన్ని కోరుకోడు. దుఃఖం, కష్టం లేని జీవితాన్ని, ప్రగతి పురోభివృద్ధుల జీవితాన్ని, ఓటమన్నది లేనేలేని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు. తనపై ఎలాంటి దౌర్జన్యం, అన్యాయం జరగరాదని, తనకు ఎల్లప్పుడు సంపూర్ణ న్యాయం అందాలని అనుకుంటారు. కాని ఈ పరిమిత ప్రాపంచిక జీవితంలో మనిషికున్న ఈ అపరిమిత ఆకాంక్షలు నెరవేరవు.

కాని ఈ ఆకాంక్షలు నెరవేరతాయని అల్లాహ్ చెప్పాడు. కాని ఈ ప్రాపంచిక జీవితంలో కాదు. ప్రళయం తరువాతి పరలోక జీవితంలో ఇవి నెరవేరుతాయి. అయితే, ఒక షరతు ఉంది. అదేమిటంటే, ఈ ప్రపంచంలో మనిషి తన సృష్టికర్తను చూడకపోయినా, ఆయన చిహ్నాలను చూసి గుర్తించి, తన సృష్టికర్త అభీష్టం ప్రకారం నడుచుకోవాలి.

ఇస్లాం జీవితం గురించిన ప్రాథమిక ప్రశ్నలకు తార్కిక సమాధానాలను ఇచ్చింది. ఈ ప్రశ్నలకు సంబంధించి ఎలాంటి సందేహాలు మిగలకుండా జవాబులిచ్చింది. మనిషి తన జీవితం ఎలా గడపాలో కూడా ఇస్లాం నేర్పింది. జీవితంలో అన్ని రంగాల్లో హితబోధల మార్గదర్శనం లభించేలా చేసింది. ఇస్లామీయ బోధనలు మనిషి నైజానికి, సహజ ప్రవృత్తికి పొంతన కలిగిన బోధనలు.

ఉదాహరణకు, ఇస్లాం మద్యాన్ని నిషేధించింది. మద్యం వల్ల మనిషి బుద్ధి, ఆరోగ్యం రెండూ దెబ్బతింటాయన్నది వాస్తవం. దీనివల్ల సమాజానికి అపారమైన నష్టం కలుగుతుంది. ఇస్లాం వడ్డీని నిషేధించింది. ఎందుకంటే వడ్డీ వల్ల ఆర్థిక అసమానతలు ఏర్పడతాయి. ధనికులు మరింత ధనవంతులవుతారు, పేదలు మరింత పేదలవుతారు. ఒకవైపు వడ్డీని నిషేధించి మరోవైపు సంపన్నులపై విధిదానాన్ని (జకాత్‌ను) బాధ్యతగా చేసింది. అంటే వారు తమ సంపదలో నుండి ప్రతి సంవత్సరం కొంతభాగం పేదలకు ఇవ్వాలి. దీనివల్ల సంపద కేవలం ఉన్నత తరగతిలో మాత్రమే ఉండకుండా కింద తరగతుల ప్రజల వద్దకు కూడా చేరుతుంది. దీనివల్ల ప్రతి మనిషి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతుంది. సంపద

కేంద్రీకరణకు దారితీసే ఇతర మార్గాలను, ఉదాహరణకు, జూదం, బెట్టింగ్, లాటరీలను ఇస్లామ్ అడ్డుకుంటుంది. ఇవి అనేక మంది జేబుల నుండి ధనాన్ని కొద్దిమంది వద్దకు చేరుస్తాయి.

కుటుంబవ్యవస్థను నాశనం చేసి, నైతికంగా మనిషిని దిగజార్చే వ్యభిచారాన్ని ఇస్లాం నిషేధించింది. ఈ దుశ్చేష్ట క్షణిక సుఖం కోసం మొదలవుతుంది కానీ చాలా చెడ్డ ఫలితాలకు దారి తీస్తుంది. అక్రమ సంబంధాలు హత్యలకు కారణమవుతుంది. వ్యభిచారానికి తలుపులు తెరిచే ప్రేరణలను కూడా ఇస్లాం అడ్డుకుంది. ఉదాహరణకు, స్త్రీపురుషులు ఏకాంతంలో కలవడం, స్త్రీలు అసభ్యమైన దుస్తులు ధరించడం వంటి వాటిని అడ్డుకుంది. దివ్యఖుర్ఆన్ మొదట పురుషులను ఉద్దేశించి దృష్టిని కిందికి వాల్చాలని ఆదేశించింది. ఆ తర్వాత మహిళలను ఉద్దేశించి తమ అందచందాలను పరపురుషుల ముందు ప్రదర్శించరాదని ఉపదేశించింది. స్త్రీల అర్ధనగ్న వస్త్రధారణ పురుషులపై చెడు ప్రభావం వేయరాదన్నది హిజాబ్ ఆదేశాల వెనుక ముఖ్యోద్దేశం. మరో ఉద్దేశం మహిళల పవిత్రతను కాపాడటం. సమాజంలో అసభ్యత, అశ్లీలాలను వ్యాపించేలా చేసే కారకాలన్నింటిని నియంత్రించి వ్యభిచారానికి దారితీసే తలుపులు మూయడం జరిగింది. అసహజ లైంగిక చేష్టలను నిషేధించి, సహజ లైంగికవాంఛను కూడా నికాహ్ వ్యవస్థ ద్వారా కట్టడి చేయటం జరిగింది. ఆ విధంగా ఆరోగ్యవంతమైన, నీతిమంతమైన సమాజం ఏర్పడేలా ఇస్లామ్ జాగ్రత్తలు తీసుకుంది.

సమాజంలో వ్యక్తి ప్రాణం, ఆస్తి, గౌరవ మర్యాదలకు ఇస్లామ్ రక్షణ కల్పించింది. ఆ విధంగా సమాజంలో శాంతిభద్రతల వాతావరణం స్థిరపడేలా చేసింది. కఠిన చట్టాలతో నేరస్థులను నియంత్రించింది. హక్కులు, బాధ్యతలు స్పష్టంగా ప్రకటించింది. అల్లాహ్ ఈ విశ్వాన్ని సృష్టించి పోషిస్తున్నాడు కాబట్టి ఆయన్ను ఆరాధించడం, ఆయన ఆజ్ఞాపాలన చేయడం మనిషి బాధ్యత. అల్లాహ్ ఆరాధనలో ఇతరులను భాగస్వాములుగా చేయడం ద్వారా అల్లాహ్ హక్కును మనిషి భంగపరచరాదు. ఇలా చేయడం, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడాన్ని అతి పెద్ద పాపంగా ఇస్లామ్ పేర్కొంది. దైవప్రవక్త భూమిపై దేవుని ప్రతినిధి. ప్రవక్తల ద్వారా మాత్రమే మానవులు మార్గదర్శనం పొందగలరు. అందువల్ల ప్రవక్తకు విధేయత చూపడం మనిషి కర్తవ్యం. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తారు, సాకుతారు, పిల్లలు తమ కాళ్ళపై నిలబడేలా చేస్తారు. అందువల్ల తల్లిదండ్రుల పట్ల విధేయత, గౌరవాదరణలు, సేవాభావం కలిగి ఉండడం మనిషి బాధ్యత. అలాగే తల్లిదండ్రులు పిల్లలను పెంచి పోషించడంతో పాటు, వారికి మంచి విద్యాశిక్షణలు అందించడం వారి బాధ్యత. ఆ విధంగా పిల్లలు సమాజానికి శాపం కాకుండా సమాజానికి మేలుచేసేవారిగా మారే వాతావరణం సృష్టించింది ఇస్లామ్. బంధువుల హక్కులను కూడా స్పష్టంగా పేర్కొంది. బంధువులను నిరాదరణకు గురిచేయరాదు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతను విడిచిపెట్టే ఆస్తిలో బంధువులకు వాటా నిర్ణయించబడింది. దీని వల్ల సంపద పంపిణీ జరిగి ఒకేచోట పోగు పడకుండా ఉంటుంది. నైతిక సూత్రాలను కూడా స్పష్టం చేయడం జరిగింది. మనిషి తన కోసం ఇష్టపడేదే ఇతరుల కోసం కూడా ఇష్టపడాలని నైతికనియమాలు నిర్దేశించింది ఇస్లామ్. మనిషి మాటల ద్వారా లేదా చేతల ద్వారా ఇతరులకు బాధ కలిగించరాదు. న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా నేరస్థులకు శిక్షలు విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. చట్టం దృష్టిలో అందరూ సమానులుగా ఉండాలి. కొంతమంది నేరస్థుల పట్ల మెతకవైఖరి చూపడమంటే మొత్తం సమాజాన్ని అశాంతికి గురిచేయడమే అవుతుంది. అందుకే ఇస్లాం నేరాలకు తగిన శిక్షలను కఠినంగా అమలు చేస్తుంది. సమాజంలో నైతిక విద్యను విద్యా వ్యవస్థలో భాగంగా చేర్చి ప్రజల హృదయాల్లో తీర్పుదినం గురించి అవగాహన కలిగించడం జరిగింది. ఇది మనిషిని ఒంటరిగా ఉన్నప్పుడు కూడా పాపాలకు నేరాలకు దూరంగా ఉంచుతుంది. కేవలం న్యాయవ్యవస్థ, పోలీసు బలం మాత్రమే నేరాలను అరికట్టలేవు. తీర్పుదినాన దేవునికి జవాబు చెప్పుకోవాలన్న బాధ్యతాభావం మాత్రమే సమాజంలో శాంతిభద్రతలు కాపాడే బలమైన ప్రేరణగా నిలుస్తుంది.

సమాజంలో వ్యక్తుల మధ్య శత్రుత్వం, విరోధం పెంచే సామాజిక రుగ్మతలను కఠినంగా అదుపు చేయడం జరిగింది. పుకార్లను నమ్మరాదు, పుకార్లను మరింత పెంచరాదు. ఫ్యాక్ట్ ఫైండింగ్ ద్వారా వార్తలను నిర్ధారించాలి. వ్యక్తుల ప్రైవేటు జీవితంలో


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

తొంగిచూడడం, వ్యక్తిగత విషయాల పట్ల ఆసక్తి చూపడం నిషిద్ధం. తోటి వారిని అవహేళన చేయడం, చెడుపేర్లతో పిలవడాన్ని కూడా నివారించడం జరిగింది. దీనివల్ల వారి మనస్సులు గాయపడ తాయి. చాడీలు చెప్పడాన్ని చెడ్డపనిగా పేర్కొని వారించడం జరిగింది. దీనివల్ల సంబంధాలు దెబ్బతింటాయి.

సమాజం నుండి దౌర్జన్యాలను పూర్తిగా తొలగించడం సాధ్యంకాదు. ఈ ప్రపంచాన్ని దేవుడు పరీక్షావేదికగా సృష్టించాడు. పరీక్ష కోసం కార్యాచరణ స్వేచ్ఛ, వనరులు అవసరం. ఈ స్వేచ్ఛను, వనరులను దుర్వినియోగపరిచే అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి. అధికారం, వనరులు పుష్కలంగా ఉన్న వ్యక్తి వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఎక్కువ. పాలకుల చేతుల్లో అధికారాలు, వనరులు ఎక్కువగా ఉంటాయి, అందువల్ల పాలకుల ద్వారానే అధికార దుర్వినియోగం అధికంగా జరుగుతుంది, దారుణమైన అణచివేత జరుగుతుంది. దుర్మార్గుడి దౌర్జన్యాన్ని నిరోధించాలని ఇస్లాం చెబుతుంది. దుర్మార్గుడికి వ్యతిరేకంగా గొంతు విప్పడాన్ని మహత్తరమైన సంఘర్షణగా పరిగణిస్తుంది. అణచివేతను భరించడం లేదా దాని నుండి విసిగిపోయి ఆత్మహత్య చేసుకోవడం కన్నా, అణచివేతను ప్రతిఘటిస్తూ ప్రాణాలు కోల్పోవడం మేలని అంటుంది. అలా మరణించిన వారిని షహీదుగా పరిగణిస్తుంది. అణచివేతను ఎదుర్కొనే శక్తి లేక దాన్ని భరిస్తూ సహనం వహించిన వారికి గొప్ప ప్రతిఫలం ఉందని చెబుతుంది. ఇస్లాం కీలకాంశం ఏమిటంటే, మరణానంతరం పరలోకంలో దేవుని న్యాయస్థానంలో పూర్తి న్యాయం జరుగుతుందనే హామీ. అక్కడ దోషులెవ్వరూ తప్పించుకోలేరు. ఈ నమ్మకం బాధితులకు దౌర్జన్యాన్ని ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుంది లేదా శిలాసదృశులుగా సహనం వహించే ఓరిమి నిస్తుంది. ఇస్లాం మనిషిని మనిషికి బానిస కారాదని చెబుతుంది. మానసిక, శారీరక దాస్యాలన్నింటినీ నిరోధిస్తుంది. అన్ని దాస్యాల నుంచి విముక్తిని ప్రసాదించి కేవలం ఒకే ఒక్క దేవుని దాస్యం వైపు రావాలని పిలుపునిస్తుంది.

ధర్మంలో బలవంతం లేదు. ఇస్లాం హేతుబద్ధ తార్కిక వాదన లతో ఆహ్వానిస్తుంది. ఇస్లాం పటిష్టమైన సైద్ధాంతిక పునాదులపై ఉంది. ఎక్కడైనా శాంతియుత సానుకూల వాతావరణం ఉంటే, అక్కడ ఇస్లాం తన సైద్ధాంతిక బలంతో వ్యాపించగలుగు తుంది. బలవంతంగా మనుష్యులను మతం మార్చడం లేదా ఒక సిద్ధాంతాన్ని ఒప్పించడం అసాధ్యం. బలవంతం చేసి హృదయాలను గెలుచుకోవడం జరగదు. అయితే, ఇస్లాంను అవగాహన చేసుకుని ఇస్లాం స్వీకరించే మార్గంలో అడ్డంకులు కూడా ఉండరాదని ఇస్లాం కోరుతుంది. అలాంటి అడ్డంకులు సామాజిక కల్లోలాలుగా పరిగణిస్తుంది. సామాజిక కల్లోలాలు, దౌర్జన్యాలను ఇస్లాం వ్యతిరేకిస్తుంది.

ఇస్లాంలో మానవ హక్కుల రక్షణకు హామీ ఉంది. ఇస్లాంలోని నైతిక, ఆధ్యాత్మిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ- ఇవన్నీ మానవ జాతికి శ్రేయస్కరమైనవి. ఈ వ్యవస్థల మధ్య సమన్వయం, సమతుల్యం ఉంది. ఇవి పూర్తిస్థాయిలో అమలైతే సమానత్వం, న్యాయం, శ్రేయోశుభాలు లభిస్తాయి. ప్రవక్త ముహమ్మద్(స)ను ఇస్లాం మానవాళికి కారుణ్యంగా పేర్కొంది. దివ్య ఖుర్ఆన్ నైతిక, ఆధ్యాత్మిక రుగ్మతలకు చికిత్స. ఇస్లాం అంటే "శాంతి" అని అర్థం. ఇస్లాంలో జంతువుల హక్కులకు కూడా రక్షణ ఉంది. అలాగే పర్యావరణ కాలుష్యానికి కూడా నివారణ ఉంది.

**(మిగతా వచ్చేవారం)**


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# పువ్వులైనా, రాళ్లయినా సమానమే!

**కవి కరీముల్లా**

**పువ్వులు పడ్డాయని పొంగిపోయేది లేదు. రాళ్లు విసుర్తున్నారని కుంగిపోయేది లేదు.** ఒక దారిని ఎంచుకుని నడుస్తున్నప్పుడు అడ్డదారులు తొక్కేదే లేదు. నా వ్యక్తిగత జీవితంలోనూ, సాహిత్య జీవితంలోనూ ఒక మనిషి పుట్టిన కులం, మతం, ప్రాంతం ఆధారంగా ద్వేషించడమనే సంకుచిత బుద్ధులు ఎప్పుడూ లేవు.. నేనెప్పుడూ పీడిత ప్రజల పక్షపాతిని. పీడకుడు ఏ కులం వాడైనా, ఏ మతం వాడైనా వ్యతిరేకిస్తూనే రాశాను. నేను నమ్మిన ఇస్లామియా తాత్వికత చాలా విశాలమైనది, ప్రగతిశీలమైనది. ఎల్లప్పుడూ ముస్లింల జీవితాలపై మాత్రమే కవిత్వం రాయాలనే సంకుచిత భావాలేం లేవు. ఎక్కడ దుఃఖం ఉంటే అది నా దుఃఖమే అవుతుంది. ప్రస్తుత కాలంలో అత్యంత పీడనకు, వంచనకు గురి అవుతున్నది ముస్లిం సమాజమే. ముస్లింల చుట్టూ ఎన్నో అపోహలు, అపార్థాలు వ్యాపించి ఉన్నాయి. అలాంటప్పుడు ఈ సమాజంలో పుట్టి పెరిగిన కవిగా వీటిని తొలిగించడమనే బాధ్యత నాపై ఉందనుకున్నాను. అందుకే ముస్లిం అస్థిత్వం, అభద్రత, ఆవేదన, ఇస్లామోఫోబియా, ముస్లిం ఫోబియా నా కవితా వస్తువులయ్యాయి. వీటిని కవిత్వీకరించటం నా సాహిత్య జీవితంలో ఓ భాగమయ్యింది.గత ముప్పయి అయిదు సంవత్సరాల నుండి కవిత్వం రాస్తున్న నేను ఇస్లాం శాంతిని, ప్రేమను బోధిస్తుంది అని చెప్పిన కారణంగా, ముస్లిం అస్థిత్వం, అభద్రత, ఆవేదన వ్యక్తీకరించిన కారణంగా తెలుగు సాహిత్యంలో ఎంతో వివక్షతను ఎదుర్కొన్నాను.. ఇప్పటికీ ఎదుర్కొంటున్నాను. అయినా వెనుకడుగు వేసేదే లేదు.

చాలామంది ప్రోగ్రెసివ్ అని చెప్పుకునే వాళ్ల అంతరాలలో కూడా ముస్లిం సంస్కృతి పట్ల అంతులేని విద్వేషం గమనించాను. ఏ ముస్లిం కవి ఐనా ఇస్లాంను, ముస్లిం జీవన విధానంలో భాగమైన టోపీలను, గడ్డాలను, హిజాబ్‌లను విమర్శిస్తే గొప్ప సంస్కరణవాది అని కితాబులిస్తారు, వేదికలిస్తారు. ఆశ్చర్యం ఏమంటే దీనినే ముస్లిం సాహిత్యమని దబాయిస్తారు. వీరి మెప్పు కోసం ముస్లిం సంస్కృతిని బోనులో నిలబెట్టే కపటులు ఎంతో కొంత శాతం ముస్లిం కవుల్లో ఎప్పుడూ ఉంటారు. ఇస్లాం శాంతిని బోధిస్తుంది అంటే మాత్రం అది మతం, మతం గురించి మాట్లాడకూడదంటూ ఆంక్షలు విధిస్తారు. మా రాజ్యాంగ హక్కుల్ని నిరాకరిస్తారు. అంటే ముస్లిం జీవన విధానం ఎల్లప్పుడూ దూషించబడుతూ, ద్వేషించ బడుతూ ఉండాలన్నదే వీరి కోరిక... ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకున్న సామ్రాజ్యవాద శక్తులు, దేశీయ ఫాసిస్టు శక్తులు ఇస్లాం ఉగ్రవాదమని, ముస్లింలు హింసావాదులని దుష్ప్రచారం చేస్తుంటే ఈ ఫోబియా మూకుమ్మడి దాడులకు కారణమౌతుంటే కనీసం ఇస్లాం శాంతిని బోధిస్తుందని, మా జీవన విధానం శాంతి, ప్రేమలతో ముడిపడి ఉందని మేం సాహిత్యంలో చెప్పుకోకూడదా? ఇస్లామే రాజ్యమేలాలని, ముస్లింలే పల్లకీలెక్కాలని మేం కోరుకోవడం లేదు. భిన్న విశ్వాసాలు, భిన్న సంస్కృతులు ఉన్న సాగర సంగమం భారతదేశం. అన్ని వర్గాల ప్రజలు ప్రాతినిధ్యం వహించే మతాతీత, కులాతీత, సామాజిక, ఆర్థిక అసమానతలు లేని నిజమైన సెక్యులర్ రాజ్యమే మా ఆకాంక్ష. ఇస్లాంవాద సాహిత్యోద్యమ అంతిమ లక్ష్యం ఇదే.

కథ

# ఈ తప్పు ఎవరిది?

- షహనాజ్ బేగం, అనంతపురం

**అతను దోషిలా నిలబడి ఉన్నాడు అందరి ముందు.**


దోషిలా ఏమిటి? అతను దోషియే. అక్కడి వారందరూ అతని వంక అసహ్యంగానూ, ఆగ్రహంగానూ చూస్తున్నారు. తమకు అవకాశమిస్తే అతనిని అక్కడికక్కడే చంపేయ్యాలంత కోపంగానూ, కసిగానూ ఉంది.

అవును మరి. అతను చేసింది చిన్న నేరం కాదు. 'హత్యాచారం'. అందే ఓ చిన్న బాలికను అమానుషంగా చెరిచి హత్య చేశాడు. అతనిని కాల్చి చంపినా తప్పులేదు అన్నంత ఆగ్రహం.

అతను మనిషి కాదు... మానవ రూపంలో ఉన్న మృగం. వారందరి అభిప్రాయం అదే. అతనిని పోలీసులు లాక్కెళ్లి లాకప్పులో పడేశారు.

అతనికింకా ఇరవయ్యేళ్ళు కూడా దాటలేదు. కాలేజీలో చదువు కుంటున్నాడు. ఒక చదువుకున్న కుర్రాడు.. ఇరవయ్యేళ్ళు కూడా నిండని ఆ కుర్రాడు బరితెగించి ఇలా ఓ చిన్న బాలికపై అత్యాచారం చేసి హత్య కూడా చేశాడంటే కొంతమందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. మరికొంత మందిని ఏదో ఆలోచింపజేసింది.

అతను ఎందుకిలా ఇంత దారుణానికి ఒడిగట్టాడో అర్థం కావటంలేదు. ఇది మామూలు కేసు కాదని, అతని గురించి తెల్సుకోవాలని సమాచారం రాబట్టుకోవాలని, మీడియా వాళ్ళు, పత్రిక వాళ్లు, మరికొంతమంది సామాజిక వేత్తలు అతనితో మాట్లాడాలనుకున్నారు. అతనికి ఏదో పెద్ద శిక్షే వేస్తారని ఊహించారు.



మొదట అతని తల్లిదండ్రులను కలిశారు. "మా కొడుకు సుగుణవంతుడు. అతనికెలాంటి దురలవాట్లు లేవు.మా ఊళ్లో కాలేజీ లేదని, ఇక్కడ నగరంలోని కాలేజీలో చేర్పించాము. అతని స్నేహితులే ఏదోచేసి ఉంటారు" అని గుండెలు బాదుకుంటూ చెప్పారు.

అధికారుల అనుమతితో ఆ యువకుడిని కలిశారు. అతనిని మాట్లాడించబోయారు. అతని కళ్లు ఎక్కడో నిస్తేజకంగా చూస్తున్నాయి. ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో దృశ్యాలు. అతనిని ప్రేరేపించిన ఎన్నో ఘట్టాలు కళ్ళ ముందు కదలాడాయి.

★ ★ ★

తన ఊరిలో బుద్ధిగా చదువుకుంటున్న అతనికి నగరం చేరుకున్నాక బుద్దులు మారాయి. ఏదో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లనిపించసాగింది.

అందులో అమ్మాయిలు మగపిల్లలంతా రాసుకుపూసుకుని తిరగడం, మరీ ముఖ్యంగా వారి వస్త్రధారణ, కురుచ దుస్తులు. సిగ్గూ ఎగ్గు లేకుండా ప్రవర్తించడం అతనిని ఉక్కిరిబిక్కిరి చేసేవి. వారి వంక ఆబగా చూసేవాడు. అతని వయసు అలాంటిది.

చదువు పట్ల మనసు నిలకడగా ఉండలేకపోయింది. ఆధునికత, ఫ్యాషన్ల పేరిట అందమైన అమ్మాయిలు మరింత అందంగా కన్పించాలనే తాపత్రయంతో పాశ్చాత్య దుస్తులను అనుకరిస్తూ ధరించి కన్పించేవారు. పార్కుల్లో, హెూటళ్లలో విచ్చలవిడిగా తిరుగుతూ కన్పించేవారు.

ఆ అమ్మాయిల స్నేహం పొంది వారిని వశపర్చుకోవడానికి కూడా సాహసించలేకపోయాడు. దూరం నుంచే వారి అందాలను చూపుల తోనే ఆస్వాదించేవాడు.

అతనిలో ఏవో కొత్త కొత్త వికార ఆలోచనలు కలగసాగాయి. ఇప్పటి వరకు లేని, అనుభవించని అనుభవం కోసం అతని మనశ్శరీరాలు ఉవ్విళ్ళూరసాగాయి. సామాజిక మాధ్యమాలలో వచ్చే అశ్లీల చిత్రాలను చూడనారంభించాడు. వ్యాపార ప్రకటనల్లో కన్పించే ఆడవాళ్ళ అర్ధనగ్న శరీరాలు వంటివి అతనిని రెచ్చగొట్టేవి. అతని గదిలో ఉంటున్న స్నేహితులు కొందరు సినిమాలకెళ్ళి, బూతు మాటలతో అతనిని రెచ్చగొడ్తుంటే తనకు తాను సంభాళించుకోలేక పోయేవాడు. వాళ్ళంతా అడ్డదారులు తొక్కుతుంటే వింతగా చూస్తుండేవాడు. అదంతా చూస్తూ తానో అశక్తుడిగా మిగిలి పోవటం చిన్నతనంగా భావించాడు. అలాగని బహిరంగంగా ఏదో చెయ్యటానికి ధైర్యం చాలటం లేదు. అందుకే ఓసారి అవకాశం లభించినప్పుడు ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు. అతకు అందుబాటులో ఉన్న ఓ చిన్న బాలికపై పాపకార్యం చేయబూనాడు.

అతనిలో నీతి, నిబద్ధత లోపించాయి. పాపపుణ్యాల విచక్షణ కోల్పోయాడు. దైవభక్తి అంతరించింది. సభ్యసమాజం సిగ్గుపడే చర్య జరిగిపోయింది.

ఓ దోషి, పాపి అయిపోయాడు. ఓ ప్రాణం పోవటానికి కారకుడయ్యాడు.

తరువాత జరగవల్సింది జరిగిపోయింది.

ఎంతోమంచి భవిష్యత్తు కలిగిన అతను శిక్షార్హుడయి కటకటాల పాలయ్యాడు.

ప్రస్తుత సామాజిక మాధ్యమాలు, సినిమాలు యువతను రెచ్చగొడ్తుండడం కారణం కాదా?

కొద్దిరోజుల తరువాత అతను తన శిక్షా కాలంలోనే అతని జీవితం అర్థాంతరంగా ముగిసిపోయిందని తెలిసింది. అతని కన్నవాళ్ళకి గుండెకోతని మిగిల్చింది.

ఈ తప్పు ఎవరిది? అందరిలో ఒకటే ప్రశ్న ఉదయించింది.

# అబాబీల్

1. దేశం గురించి ఆలోచించు
కష్టాల కడలికి ఎదురుగా నిలువు
అలలు ఆహ్వానిస్తున్నాయి
"సమదూ"
తీరం వైపు అడుగేయకు..

2. అన్యాయాన్ని ఎదురించంది
విశ్వాసం పరిపూర్ణం కాదు
కరం, కలం, గళం ఏవైనా ఆయుధాలే
"సమదూ"
ధ్వజవాహకులకు ఇవి షరా మామూలే..

3. లక్ష్యం లేని అక్షర ప్రయోగం
ఎడారిలో ఇసుక సేద్యం
శృతి లేని రాగం గానం
"సమదూ"
బతుకు రాత మోహం..

4. న్యాయం కోసం నిలబడు
స్వేచ్ఛ కోసం సహాయపడు
అక్షరాలకు రెక్కలు తొడుగు
"సమదూ"
కలంలో ఉద్యమ సిరా నింపు..

5. మధ్యతరగతికి మొండి చెయ్యి
కార్పోరేట్లకు కడుపు నింపి
విదేశీ కంపెనీలకు ధారాదత్తం
"సమదూ"
నిర్మలమ్మ బడ్జెట్ రుచులు వేరు..

6. గద్దె ఎక్కడం కోసం
ఎక్కిన గద్దె దిగకుండటం కోసం
మతోన్మాద రాజకీయం నడుపొద్దూ
"సమదూ"
మహామహులే గతించారని మరువద్దూ..

7. చేతి గీతల్లో లక్ష్యం వెదగకు
అడుగొక్కటే వెయ్యి గమ్యం వైపు
సూర్యోదయంతో చీకటి మాయం
"సమదూ"
తడపడకుండా పరుగిడు శిఖరం వైపు..

8. కాలచక్రం తిరుగుతుంది
క్యాలెండర్ మారుతుంది
వయసు మరో ఏడు తిరుగుతుంది
"సమదూ"
జీవిత లక్ష్యం నెరవేర్చుకో.. ..

**- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**




**మనలో** అజాన్ పలుకులు వినని వారు ఎవరుంటారు చెప్పండి! దివారాత్రుల్లో అయిదు సార్లు మనం అజాన్ పలుకుల్ని వింటుం టాము. నిజం చెప్పాలంటే విశ్వం మొత్తంలోని విశ్వాసులు అన్ని పలుకులకన్నా అధికంగా అజాన్ పలుకుల్నే వింటారు. ఆ విషయానికొస్తే ప్రపంచంలో ప్రతి ఘడియ మారుమ్రోగుతున్న ఏకైక శబ్దం అజాన్ అని అంతర్జాతీయ అధ్యయనం చెబుతోంది. ఓ చోట ఫజ్ర్ అజాన్ అయితే, మరో చోట జుహ్ర్ అజాన్, ఇంకో చోట అస్ర్ అజాన్- జగమంతా అజాన్ మయం!

### అజాన్ పరిచయం

అజాన్ అంటే ప్రకటన, పిలుపు ఇవ్వటం, వార్త అందించటం అని అర్థం. ధార్మిక పరిభాషలో నమాజ్ కోసం ప్రత్యేక పదాల ద్వారా పిలవటం అని అర్థం. అదేవిధంగా బిడ్డ పుట్టగానే కుడిచెవిలో అజాన్, ఎడమ చెవిలో ఇఖామత్ పలకాలి. నమాజ్ కోసం అజాన్ ఇవ్వటం ప్రవక్త సంప్రదాయం. ఇది ఇస్లామ్ చిహ్నాల్లో ఒక చిహ్నం. ఐదుపూటల నమాజుకు అజాన్ ఇవ్వటం ప్రవక్త సంప్రదాయం.

### అజాన్ ఆదేశం

నిర్ణీత సమయంలో చేసే ఫర్జ్ నమాజు కొరకు అజాన్ పలకడం సున్నత్. సామూహికంగా నమాజ్ చేసేవారి కొరకు అజాన్ పలకడం సున్నతె ముఅక్కదహ్, ఫర్జె కిఫాయా. కాకపోతే జన సమూహంలో ఏ ఒక్కరు అజాన్ పలికినా అందరి తరపునా అదే సరిపోతుంది. ఒంటరిగా నమాజ్ చేసేవారి కొరకు అజాన్ పలకటం సున్నతె ఐనియ్యహ్.

### అజాన్ పూర్వాపరాలు-

హిజ్రీ శకం మొదటి సంవత్సరంలో అజాన్ పలకడం ప్రారంభమైనది.

**అజాన్ ప్రారంభం** : ప్రవక్త(స) మక్కాహ్ జీవితం అంతా ఆపదలతో, కష్టాలతో, బాధలతో గడిచింది. ఆ సమయంలో ఒక్క నమాజు మాత్రమే విధి అయి ఉండేది. మదీనా వచ్చిన తరువాత కొంత వరకు శాంతి భద్రతలు చోటు చేసుకున్న తరువాత విధులు, నిబంధనలు, బాధ్యతలు అవతరించటం ప్రారంభం అయ్యాయి. అనంతరం జకాత్, ఉపవాసాలు విధించ బడ్డాయి. హద్దులు నిర్దేశించబడ్డాయి. ధర్మాధర్మాలను వివరించ టం జరిగింది. ఆ కాలంలో ప్రతీ నమాజుకు ప్రజలు ఒకచోట చేరుకునేవారు. ప్రజలందరూ వచ్చిన తర్వాత నమాజును ప్రవక్త(స) చేయించేవారు. అయితే ప్రజలకు నమాజు సమయం గురించి తెలియపరిచే సాధనాలేవీ ఉండేవి కావు. అందువల్ల ప్రవక్త(స) నమాజు సమయం కాగానే యూదుల్లా డప్పులు కొట్టటం, లేదా బాకా ఊదడం చేద్దామని నిశ్చయించుకున్నారు. ఇంతలో అన్సారుల్లోని అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దురబ్బిహ్

స్వప్నంలో అజాన్ పదాలు చూశారు. మేల్కొని ప్రవక్త (స) వద్దకు వచ్చి, వివరించారు. దానికి ప్రవక్త(స) నీ కల సత్యమైనది, బిలాల్‌కు అజాన్ నేర్పించ వలసిందిగా ఆదేశించారు. బిలాల్ అజాన్ ఇస్తున్నారు. ఇంతలో 'ఉమర్ (ర) వచ్చి తన స్వప్నాన్ని గురించి వివరిస్తూ, 'నేను కూడా స్వప్నంలో ఈ పదాలనే విన్నాను' అని అన్నారు. ప్రవక్త(స) అది విని చాలా సంతోషించారు. ఇద్దరు ముస్లిముల ఏకాభిప్రాయంపై అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. (ఇబ్నె హిషామ్- 283, జామె తిర్మిజి- 37)

ఆధారం: అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఓ విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజు కొరకు అజాన్ (పిలుపు) ఇవ్వబడినప్పుడు, మీరు అల్లాహ్ ధ్యానం వైపు పరుగెత్తండి, క్రయ విక్రయాలను వదలిపెట్టండి. మీరు గనక తెలుసుకోగలిగితే ఇది మీ కొరకు ఎంతో మేలైనది." ( సూరా జుముఅహ్: 9)

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "నమాజు చేసే సమయం ఆసన్నమైనప్పుడు మీలో ఒకరు అజాన్ పలకాలి. మీలోని పెద్దవారు ఇమామత్ చేయాలి. (బుఖారి:602, ముస్లిం: 674)

## అజాన్ పరమార్థం

అల్లాహ్ మహా వివేకి. అజాన్ పిలుపు ఇతర సముదాయాల మాదిరి కేవలం ఓ పిలుపు, లేదా హెచ్చరికలా మాత్రమే ఉండకూడదని, అజాన్ పిలుపు ఇస్లాం ధర్మ పరిచయంలా ఉండాలని, అది ఆరాధనా రూపంగా కూడా ఉండాలని అజాన్ పలుకుల్ని నుబువ్వత్‌లోని నలభైవ భాగమైన సత్య కల ద్వారా ఆయన నిర్దేశించాడు. ఇస్లామీయ ఆచరణలకు ముఖ్య ప్రాతిపదికలు తౌహీద్, రిసాలత్, ఆఖిరత్. ఈ మూడు మూలాంశాలు ఇస్లాం ధర్మానికి పునాదిరాళ్ళు. ఈ మూడు మౌలికాంశాలు మనకు అజాన్ రూపంలో విశ్వ వ్యాప్తంగా రోజుకి ఐదు సార్లు వినిపిస్తాయి.

## అజాన్ ఔన్నత్యం

హాఫిజ్ ఇబ్నె కసీర్ వ్యాఖ్యానం: అల్లాహ్ వైపునకు (ప్రజలను) పిలిచి, సత్కార్యాలు చేసి, నేను ముస్లింని అని పలికినవాని మాటకంటే శ్రేష్ఠమైన మాట మరెవరిది అవుతుంది? (హామీమ్ అస్సజ్దా : 33) ఈ ఆయతు అందరికి వర్తిస్తుంది. అందరికంటే ప్రవక్త (స)కు అధికంగా.

సహీ ముస్లిమ్‌లో ఇలా ఉంది "తీర్పుదినం నాడు ముఅజ్జిన్‌లు అందరికంటే పొడవైన మెడలు కలిగి ఉంటారు. ఇంకా సునన్‌లో ముఅజ్జిన్ నిజాయితీ పరుడని ఉంది. అల్లాహ్ ఇమాములకు సన్మార్గం చూపాలి, ముఅజ్జి'న్‌లను క్షమించాలి అని ఉంది.

ఇబ్నె అబీ హాతిమ్‌లో ఇలా ఉంది, సఅద్ బిన్ అబీ వఖ్ఖాస్(ర) అభిప్రాయం: "అజాన్ ఇచ్చేవారికి తీర్పుదినం నాడు అల్లాహ్ వద్ద జిహాద్ చేసిన వారికి లభించినంత పుణ్యం లభిస్తుంది.

ఆయిషహ్ (ర) కథనం: హయ్యు అలస్సలాహ్ అని పిలవటం దేవుని గొప్పతనం వైపు పిలవటం అవుతుంది.

మరో హదీసులో, అజాన్, ఇఖామత్‌ల మధ్య దుఆ (ప్రార్థన) తిరస్కరించబడదు అని ఉంది. అందువల్ల ఈ ఆయతు అల్లాహ్ వైపు పిలిచే వారందరికీ వర్తిస్తుంది.

హసన్ బస్రీ ఈ ఆయతు పఠించి, 'వీరు దైవప్రియ భక్తులు, వీరే అల్లాహ్ సన్నిహితులు అల్లాహ్‌ను ప్రేమించేవారు, వీరు విశ్వసించి, ఇతరులకు కూడా వాటిని అందజేస్తారు. సత్కార్యాలు చేస్తారు. వీరే దైవప్రతినిధులు' అని వ్యాఖ్యానించారు.

## అజాన్ పిలుపుకి షైతాన్ పరార్

అబూ హురైరహ్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, "నమాజు కోసం అజాన్ ఇస్తే, షైతాన్ అజాన్ వినబడనంత దూరం పారిపోతాడు. అజాన్ పూర్తవగానే మళ్ళీ తిరిగి వస్తాడు, ఇఖామత్ అయిన వెంటనే పారిపోతాడు, పూర్తవగానే మళ్ళీ తిరిగి వస్తాడు. నమాజీల హృదయాల్లో కలతలు సృష్టిస్తాడు. ఇంకా ఆ వ్యక్తికి మరచి పోయిన పనులను గుర్తుచేస్తాడు. ఈ విధంగా ఆ వ్యక్తి ఎన్ని రకాతులు చదివాడో తెలియకుండా చేస్తాడు". (బుఖారీ, ముస్లిమ్)

జాబిర్ (ర) కథనం: ప్రవక్త (స) ఇలా ప్రవచిస్తూ ఉండగా నేను విన్నాను. "నమాజు అజాన్‌ను విని షైతాన్ రౌహా ప్రాంతం వరకు పారిపోతాడు" ఉల్లేఖన కర్త రౌహా మదీనహ్‌కు 36 మైళ్ళదూరంలో ఉంది అని అన్నారు. (ముస్లిమ్)

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## గాయపడిన వారిని ఆస్పత్రిలో చేరిస్తే రూ.25000 రివార్డు

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించి బాధితులను దవాఖానలకు తరలించి, ప్రాణాలను కాపాడే వారిని మరింత ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా మానవత్వం చాటుకుంటున్న వారికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ.5,000 ప్రోత్సాహకాన్ని అందిస్తున్నది. దీనిని ఐదింతలు పెంచి రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్టు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. నాగ్‌పూర్‌లో రోడ్డు భద్రతకు సంబంధించి జరిగిన ఓ కార్యక్రమంలో నటుడు అనుపమ్ ఖేర్‌తో కలిసి గడ్కరీ పాల్గొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి ఏడు రోజులు చికిత్స అందించేందుకు అయ్యే ఖర్చును రూ.1.5 లక్షల వరకు ప్రభుత్వం భరించనున్నట్టు గడ్కరీ చెప్పారు.

## పార్కింగ్ స్థలముంటేనే కారు అమ్మకం

కారు కొనాలనుకుంటున్నారా? అయితే దానిని పార్కింగ్ చేయ డానికి మీకు తప్పనిసరిగా స్థలం ఉండాల్సిందే. లేకపోతే మీకు ఎట్టి పరిస్థితుల్లో కార్లను అమ్మరు. ఈ కొత్త పాలసీని మహారాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనుంది. పట్టణ ప్రాంతాల్లో వాహనాల రద్దీని నివారించడానికే ఈ నిబంధనను తేవాలని యోచిస్తున్నట్టు మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీ సమస్య విపరీతంగా పెరిగిపోయిందని, చాలామంది పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారని, దీని కారణంగా అంబులెన్స్‌లు, ఫైర్ లాంటి సర్వీసులకు ఆటంకం ఏర్పడుతున్నదని ఆయన చెప్పారు. అయితే బీదవారు, మధ్య తరగతి వారు కార్లను కొనుగోలు చేయకుండా నిరోధించడానికి, వారిపై వివక్షను చూపడానికి ఈ నిబంధన తేవడం లేదని స్పష్టం చేశారు.

## అగ్రశేణి నౌకాదళంగా భారత్

ఒకేసారి శక్తిమంతమైన అస్త్రాలు మూడు చేరడంతో భారత నౌకాదళం మరింత సమున్నతమైంది. ముంబై నావల్ డాక్ యార్డ్ నుంచి భారత నౌకాదళ చరిత్రలో తొలిసారి ఓ డిస్ట్రాయర్, ఓ ఫ్రిగిట్, మరో జలాంతర్గామి భారత అమ్ములపొదిలోకి చేరాయి. యుద్ధనౌకలైన ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంత ర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. భారత సముద్ర వారసత్వం, నౌకాదళ చరిత్ర, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌కు ఇది చిరస్మరణీయమైన రోజు అని ఈ సందర్భంగా మోదీ అన్నారు. మూడు శక్తిమంతమైన అస్త్రాలు ఒకేసారి నౌకాదళంలో చేరడం చరిత్రలో ఇదే మొదటి సారని చెప్పారు. ఇవి స్వదేశంలో తయారు కావడం అత్యంత గర్వకారణమని కొనియాడారు.

## పేద కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబన కోసం జకాత్ సెంటర్ ఇండియా పాటుడుతోంది




పేద ముస్లిములకు ఆర్థిక స్వావలంబన చేకూర్చేందుకు జకాత్ సెంటర్ ఇండియా కృషిచేస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ అమీనుల్ హసన్ అన్నారు. వెనుకబడిన ముస్లిముల జీవితాల్లో ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన అన్నారు. సేకరించిన జకాత్ నిధులను పలు పథకాల ద్వారా అత్యంత సమర్థవంతంగా వినియోగించేందుకు జకాత్ సెంటర్ ఇండియా (ZCI) 2025 జనవరి 14, 15 తేదీల్లో రెండు రోజుల వర్క్‌షాపు హైదరాబాద్‌లో నిర్వహించింది. దక్షిణ భారతదేశంలోని వివిధ యూనిట్ల ప్రతినిధులు హాజరయ్యారు, జకాత్‌ను 2025కి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికల్లో కమ్యూనిటీ మోడల్స్, బిజినెస్ మెంటరింగ్ ప్రోగ్రామ్‌లు, మైక్రోఫైనాన్స్ సంస్థలు, స్కిల్ ట్రైనింగ్ సంస్థలతో భాగస్వామ్యం గురించి చర్చించారు. వర్క్ షాప్ ముగింపులో, జనవరి 15న టోలిచౌకీలోని ముస్లిం జనరల్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జకాత్ సెంటర్ ఇండియా చైర్మన్ ఎస్.అమీనుల్ హసన్, సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ సిద్దిఖీలు జకాత్ సెంటర్ ఇండియా ప్రణాళికలను మీడియాకు వివరించారు. చైర్మన్ ఎస్.అమీనుల్ హసన్ మాట్లాడుతూ బలహీన, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక చేయూతనందించి వారిని స్వయం సమృద్ధి వైపు నడిపించడమే జకాత్ సెంటర్ ఇండియా లక్ష్యమన్నారు. సేకరించిన జకాత్ మెరుగైన పంపిణీ, సమాజ అభివృద్ధికి ఎలా సద్వినియోగం చేయాలో ఈ వర్క్ షాపులో చర్చించామన్నారు. 2024లో జకాత్ సెంటర్ ఇండియా పథకాల ద్వారా నాలుగు వేల మందికి పైగా లబ్ధిపొందారన్నారు. 2022లో 9 యూనిట్ల సంఖ్యను 2024లో 21కి పెంచామన్నారు. జకాత్ సెంటర్ ఇండియా బలహీన వర్గాలకు సాధికారత కల్పించే దిశలో విజయపథంలోకి దూసుకెళుతోందని అన్నారు. విలేకరుల సమావేశంలో మౌలానా మొహియుద్దీన్ ఘాజీ ఫలాహి, సయ్యద్ తన్వీరుల్ హక్ పాల్గొన్నారు.




## సాయుధ ఘర్షణలే తక్షణ ముప్పు

దేశాల మధ్య సాయుధ ఘర్షణలే ప్రపంచానికి తక్షణ ముప్పుగా పరిణమించినట్టు ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) పేర్కొంది. 2025 ఏడాదికి సంబంధించి ప్రపంచం ఎదుర్కోనున్న ముప్పులపై ఓ నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాదిలో భూగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా చీలికలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. తప్పుడు సమాచారం వల్ల స్వల్పకాలిక ముప్పులు ఏర్పడుతాయని, రానున్న 10 సంవత్సరాల కాలంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు, జీవవైవిధ్య నష్టం, పర్యవరణ వ్యవస్థ పతనం వంటి పర్యావరణ ముప్పులు అధిక ప్రభావం చూపుతాయని నివేదిక పేర్కొంది.

## ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం

గాజాలో శాంతిస్థాపన కోసం ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధాన్ని ముగించడానికి అంగీకరించాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. వచ్చే ఆరు వారాల పాటు యుద్ధం ఉండదు. దీంతో బందీలను కూడా విడుదల చేయనున్నారు  కాల్పుల విరమణ ఒప్పందం, బందీల విడుదలకు సంబంధించి మధ్య వర్తులకు తమ ప్రతినిధి అంగీకారం తెలిపిందని హమాస్ పేర్కొంది. ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో చివరి నిమిషంలో వివాదం పరిష్కారం అయ్యిందని.. ఖతార్ - హమాస్ అధికారులు తెలిపారు. ఆ తర్వాత, గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపడానికి, డజన్ల కొద్దీ బందీలను విడుదల చేయడానికి కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇజ్రాయెల్ - హమాస్ అధికారులు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందంతో ఇజ్రాయెల్ - హమాస్ మధ్య 15 నెలల సుదీర్ఘ సంఘర్షణకు ముగింపు పలికింది.

## లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు.. నష్టం 5 లక్షల కోట్లు

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు అదుపులోకి రావడం లేదు. పాలిసాడ్స్ ఫైర్.. ఈటన్ ఫైర్.. సన్‌సెట్ ఫైర్.. ఇలా వేర్వేరు పేర్లతో ఆరు చోట్ల కార్చిచ్చు రగులు తూనే ఉంది. వేల ఎకరాలు ఆహుతవ్వగా.. హాలీవుడ్ కొండలను అగ్ని చుట్టుముట్టింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు సహా.. పలువురు హాలీవుడ్ స్టార్ల ఇళ్లు బుగ్గిపాలవ్వగా.. ఐదుగురు పౌరులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దగ్ధమైన ఆస్తులు, వనరుల నష్టం విలువ రూ.5 లక్షల కోట్లు(57 బిలియన్ డాలర్లు)గా ఉంటుందని గుర్తించినట్లు తెలిపారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.

## పాకిస్థాన్‌లో 33 టన్నుల బంగారం నిక్షేపాలు!

తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌లో 'బంగారం' పంట పండింది. ఆ దేశంలోని పంజాబ్ ప్రావిన్స్ అటోక్ జిల్లాలో విస్తరించి ఉన్న సింధు నది లోయలో భారీగా బంగారం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 32.6 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్థాన్ (జీఎస్‌పీ) వెల్లడించింది. వీటి విలువ రూ.18 వేల కోట్లకు పైనే (600  బిలియన్ పాకిస్థానీ రూపాయలు) ఉంటుందని అంచనా వేసింది. సింధు నది, హిమాలయాల దిగువన టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువగా ఉంటాయి. ఆ చర్యల వల్లే అక్కడ బంగారం అణువులు ఏర్పడుతుంటాయి. ఆ అణువులు సింధు నది ప్రవాహం ద్వారా పాక్‌లోని పరీవాహక ప్రాంతంలో వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాక్‌కు ఇక మంచిరోజులు వచ్చినట్టేనని నిపుణులు చెబుతున్నారు.

## గాజాలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

గాజాలో మొత్తం విద్యావ్యవస్థను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేసిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో 'ముస్లిం దేశాలలో బాలికల విద్య' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో ఆమె ప్రసంగించారు. ఈ సమ్మిట్‌కు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గాజాలో అన్ని యూనివర్సిటీలపై ఇజ్రాయిల్ బాంబుదాడులు జరిపిందన్నారు. 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసిందనీ, పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్న పౌరులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ మానవహక్కుల, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. పాలస్తీనాలో పిల్లలు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పాలస్తీనా బాలిక చదువుకునే పాఠశాలపై బాంబు దాడిచేసి, ఆమె కుటుంబాన్ని హత్య చేస్తే ఆమెకి భవిష్యత్తు లేకుండా చేసినట్టేనని అన్నారు.

# మధ్యే మార్గమే ఉత్తమం!

**అస్మా**


**ఆయన ఆకాశాన్ని పైకిలేపాడు, త్రాసును నెలకొలిపాడు. కనుక మీరు సమతూకాన్ని భంగపరచ కండి  న్యాయంగా, కచ్చితంగా తూచండి, తూకంలో తక్కువ చేయకండి. (55:7-9)**

ప్రాపంచిక, ధార్మిక కార్యాచరణలకు  సంబంధించి మానవాళికి మధ్యే మార్గమమే ఉత్తమమన్నది ఖుర్ఆన్ ఉద్బోధ. కోరికలను అదుపులో ఉంచుకొని నిరాడంబరంగా జీవిస్తూ అన్ని విషయాల్లోనూ తగిన అప్రమత్తతో ముందుకు సాగడాన్ని మధ్యే మార్గం అంటారు. మధ్యేమార్గంలో పయనిస్తూ ఇహ, పర బాధ్యతలు పరిపూర్ణంగా, విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన జీవన విధానాన్ని  ఇస్లాం  నిర్దేశించింది. ఖుర్ఆన్‌లో ఇందుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. మనిషి పూర్తిగా భౌతిక సుఖాలకు బానిసైతే మరణానంతరం పర లోకంలో నరక శిక్ష అనుభవించాల్సి వస్తుంది. అలాగే బతికున్నప్పుడు పూర్తిగా వైరాగ్యానికి గురై సన్యాసం స్వీకరిస్తే ప్రాపంచిక జీవిత పరమార్థాన్ని తెలుసుకోలేము. కాబట్టి ఇహ పరాల్లో సాఫల్యం కోసం మనిషి తనకు నిర్దేశించిన బాధ్యతలను నెరవేర్చడానికి పరిశ్రమించాలని ఖుర్ఆన్‌లో అల్లాహ్ ప్రభోధించాడు. ఇలా చేయడం దైవారాధనలో భాగమేనని స్పష్టం చేశాడు. ఖుర్ ఆన్ ప్రకారం ముస్లింలు అవసరం మేరకే ఆహార పానీయాలు తీసుకోవాలి. తిండికి, లైంగిక సుఖాలకు బానిస కాకూడదు. "మేము ఇచ్చిన పరిశుద్ధమైన ఆహారాన్ని తినండి. దానిని తిని తిరుగుబాటు చెయ్యకండి. చేస్తే నా ఆగ్రహం మీపై విరుచుకుపడుతుంది." (ఖుర్ఆన్ 20:81)

వస్త్ర ధారణ నిండుగా, నిరాడంబరంగా, హుందాగా ఉండాలి. అవసరం మేరకే దుస్తులను కొనాలి. ముఖ్యంగా మహిళల వస్త్రధారణకు సంబంధించి ఖుర్ఆన్.. "ప్రవక్తా!  విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, తమ అలంకర ణను ప్రదర్శించవలదని - దానంతట అదే కనిపించేది తప్ప- తమ వక్షస్థలాలను ఓణీ అంచులతో కప్పుకోవాలని" (24:31), స్పష్టమైన హెచ్చరికలు చేసింది. ముస్లింలు నివసించే ఇండ్లు సైతం నివాస యోగ్యంగా ఉండాలి కానీ, ఖరీదైన ఆలంకరణ వస్తువులతో నిండి ఉండకూడదని ఇస్లాం హితవు పలికింది. మనుషులు పేదరికంలో ఉన్నా పర్వాలేదు కానీ.. ఆస్తులున్నాయన్న అహంకారం కాని, భోగ విలాసాల మత్తులో తేలడమే నిజమైన సుఖమన్న భ్రమలో కాని ఉండకూడదని హెచ్చరించింది.

"బాగా తెలుసుకోండి, ఈ లౌకిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు పలకటం, సంపద, సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు. దాని దృష్టాంతం ఇలా ఉంది: ఒక వర్షం కురిసింది. అప్పుడు దాని వల్ల మొలకెత్తి పెరిగిన చెట్లూ చేమలను చూచి, రైతులు సంబరపడ్డారు. తరువాత, అవే పండుతాయి. ఆ తరువాత అవి పసుపుపచ్చగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. ఆపై అవి ఎండిపోయి పొట్టుగా మారిపోతాయి. దీనికి భిన్నంగా, పరలోకం ఇలా ఉంటుంది: అక్కడ తీవ్రమైన శిక్ష ఉంటుంది, అల్లాహ్ క్షమాభిక్ష, ఆయన  ప్రసన్నత ఉంటాయి. ప్రాపంచిక జీవితం ఒక మాయ తడిక తప్ప మరేమీ కాదు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి, ఒకరికంటే ఒకరు ముందుకుపోయే కృషి చేయండి  ఆకాశాలంత, భూమి యంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించిన వారి కొరకు సిద్ధం చేయబడిరది. ఇది అల్లాహ్ అనుగ్రహం  తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఎంతో అనుగ్రహం కలవాడు. (ఖుర్ఆన్ 57:20-21)

**తుదిగేటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**